

గ్రేటర్‌పై టీడీపీ దృష్టి

తొలుత స్టాండింగ్ కమిటీల కైవసానికి వ్యూహం





- తదుపరి మేయర్ పీఠం...
- 'దేశం'లో చేరేందుకు 22 మంది వైసీపీ కార్పొరేటర్లు సిద్ధం?
- రేపే ముహూర్తం

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి):

మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ పీఠంపై టీడీపీ దృష్టిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఎజెండా మేరకు నగరంలో అభివృద్ధి జరగాలంటే జీవీఎంసీపై పట్టు ఉండాలని భావిస్తున్న తెలుగుదేశం అందుకు అనుగుణంగా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న వైసీపీకి చెందిన సుమారు 22 మంది కార్పొరేటర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. వైసీపీ కార్పొరేటర్లు ఈనెల 21వ తేదీ ఆదివారం టీడీపీలో చేరే అవకాశం ఉంది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నగర మేయర్ పదవిపై టీడీపీ గురిపెట్టింది. అయితే మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలంటే మరికొంతకాలం వేచి ఉండాలి. మేయర్/మునిసిపల్ చైర్మన్ పదవుల్లో ఉన్న వారు నాలుగేళ్లు కొనసాగేలా వైసీపీ ప్రభుత్వం చట్టం చేసింది. అందువల్ల మేయర్ పదవిని టీడీపీ చేజిక్కించుకోవాలంటే అసెంబ్లీలో గతంలో చేసిన చట్టానికి సవరణ చేయాలి. అందుకు కొంత సమయం పడుతుంది. ఈలోగా జీవీఎంసీలో స్టాండింగ్ కమిటీలు కైవసం చేసుకోవాలని నిర్ణయించింది. గురువారం రాత్రి నగరంలోని ఒక హోటల్‌లో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, పార్టీ నగర అధ్యక్షుడు గండి బాబ్జీ, జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్ లీడరు పీలా శ్రీనివాస్, తదితరులు సమావేశమయ్యారు. మేయర్ పీఠం కంటే ముందు స్టాండింగ్ కమిటీలు చేజిక్కించుకోవాలని నేతలు అభిప్రాయపడినట్టు తెలిసింది. అభివృద్ధి జరగాలంటే జీవీఎంసీపై ప్రభుత్వానికి పట్టు ఉండాలని, అందుకు సంబంధించి పనులకు ఆమోదం తెలిపే స్టాండింగ్ కమిటీలను కైవసం చేసుకోవాలనే అభిప్రాయానికి వచ్చారు. ఇందుకు అవసరమైన వైసీపీ కార్పొరేటర్లను టీడీపీలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం జీవీఎంసీలో 98 కార్పొరేటర్లలో టీడీపీకి 27 మంది కార్పొరేటర్లు ఉన్నారు. టీడీపీ తరపున గెలిచి వైసీపీకి మద్దతుగా నిలిచిన కాకి గోవిందరెడ్డి, లేళ్ల కోటేశ్వరరావు, కోడిగుడ్ల పూర్ణిమను ఎట్టి పరిస్థితుల్లో కౌన్సిల్‌లో మద్దతు కోరవద్దని నిర్ణయించినట్టు తెలిసింది. జనసేనకు ముగ్గురు, బీజేపీకి ఒకరు, ఇండిపెండెంట్లు ముగ్గురు ఉన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైసీపీకి చెందిన మరో కార్పొరేటర్ ఇప్పటికే టీడీపీలో చేరారు. ఇంకా జీవీఎంసీ పరిధిలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నారు. మొత్తం 45 మంది ఉన్నారు. మరో ఐదుగురు సభ్యుల మద్దతు ఉంటే జీవీఎంసీలో కూటమికి మెజారిటీ లభిస్తుంది. అయినా కౌన్సిల్‌లో పటిష్ఠంగా ఉండాలని భావించిన టీడీపీ నేతలు వైసీపీ నుంచి ... మిగతా 6వ పేజీలో

కొండంత సంబరం

సింహగిరి ప్రదక్షిణం భూ ప్రదక్షిణతో సమం

గిరి ప్రదక్షిణతో కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం

సింహాచలం, జూలై 19:

భారతీయ సంస్కృతికి మూలం వేదాలు. వేదాలు ప్రకృతిని పరమాత్మ స్వరూపంగా పేర్కొన్నాయి. అందుకే అనాదిగా భారతీయులు చెట్లు, పుట్టలు, నదులు, సముద్రాలను, పర్వతాలను పూజిస్తుంటారు. పర్వతాలకు భూధరాలని పేరు. అంటే భూమిని ధరించేవని అర్థం. వేదాల ప్రకారం విష్ణుః పర్వతానాం అధిపతిః. అందుకే పర్వతాలు పూజించబడుతున్నాయి. భూమి సమతుల్యతను కాపాడేవి పర్వతాలు. సాధారణంగా స్వయంభువుడుగా భగవానుడు వెలసిన క్షేత్రాలన్నీ అధికశాతం పర్వతాలపైనే ఉంటాయి. అదే పర్వతాలపై పురాణాల కాలంలో మునులు, యోగులు తపస్సులు చేసి జ్ఞాన సముపార్జన చేశారు. అటువంటి అనేక దైవీ భావనలు ఉండడం చేతనే పర్వతాలను పూజించడం, వాటి చుట్టూ ప్రదక్షిణలు చేయడం వేదకాలం నుంచే జరుగుతున్నట్టు విజ్ఞులు చెబుతారు.



విద్యుద్దీపాలంకరణలో సింహగిరి


వరాహ లక్ష్మీ నృసింహస్వామి ద్వయావతారుడుగా వెలసిన దివ్యధామం సింహగిరి. అందుకే సింహగిరి చుట్టూ ప్రదక్షిణం చేయడం భూ ప్రదక్షిణతో సమాన ఫలితాన్ని ఇస్తుందని చెబుతారు. సింహగిరి చుట్టూ ప్రదక్షిణలు చేసిన వారికి విద్యాభివృద్ధి, ఉద్యోగప్రాప్తి, వివాహ అనుకూలత వంటి కోర్కెలు నెరవేరుతాయని పెద్దలు చెబుతుంటారు. కోర్కెలు లేకుండా సింహగిరి ప్రదక్షిణ చేసిన వారు ఇహపర సౌఖ్యాలు పొందుతారని పండితుల మాట. భౌతికంగా సింహగిరి చుట్టుకొలత 32 కిలోమీటర్లు. సింహాచల క్షేత్ర మహాత్మ్యం ప్రకారం హిరణ్యకశిపుని సంహరించే సమయంలో విష్ణువు 32 రూపాలు ధరించాడని, అదేవిధంగా నృసింహస్వామి మూలమంత్రంలో 32 బీజాక్షరాలు ఉన్నాయని అందుకే 32 కిలోమీటర్ల వ్యాసార్థం కలిగిన సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేయడం భూ ప్రదక్షిణ చేయడంతో సమ ఫలాన్ని ఇస్తుందని అంటారు.

విస్తృతంగా ఏర్పాట్లు

- ఈ ఏడాది 8 లక్షల మంది పాల్గొంటారని అంచనా

నేడే సింహగిరి ప్రదక్షిణ ఉత్సవం

- సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం
- అప్పన్న ప్రచార రథాన్ని ప్రారంభించనున్న అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు



సింహాచలం, జూలై 19:

భూప్రదక్షిణతో సమానమైన ఫలాన్ని ఒసగే సింహ'గిరి ప్రదక్షిణ' శనివారం సాయంత్రం ప్రారంభం కానున్నది. ఏటా ఆషాఢ మాసంలో శుక్లపక్ష చతుర్దశి నాడు లక్షలాది మంది కొండంత భక్తితో వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలుదీరి ఉన్న సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేయడం ఆచారంగా వస్తోంది.

సింహగిరి ప్రదక్షిణ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్ద ప్రారంభం కానున్నది. స్వామివారి పుష్పతేరు (ప్రచార రథం)ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు జెండా ఊపి లాంఛనంగా ... మిగతా 6వ పేజీలో



గిరి ప్రదక్షిణ ప్రారంభమయ్యే తొలి పావంచా

అంతరాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు

- నేడు, రేపు అప్పన్న దర్శన వేళల్లో మార్పులు
- సిఫారసు లేఖలకు నో
- కొండపైకి ప్రైవేటు వాహనాలను అనుమతించరు

- 6వ పేజీలో

ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు కార్యాచరణ

- భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తించిన ఆ 250 ఎకరాలకు సరిహద్దులు నిర్ణయించే దిశగా అడుగులు
- హౌస్ బిల్డింగ్ సొసైటీ పనులు చేపడుతున్న ప్రాంతం సీఆర్‌జెడ్ పరిధిలోకి వస్తుందంటున్న అధికార యంత్రాంగం
- కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ కమిటీ నివేదిక కోరిన కలెక్టర్
- సొసైటీకి ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపుపై ఆలోచన?

ఎర్రమట్టిదిబ్బల్లో తవ్వకాలు (ఫైల్)



విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి):

భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తించిన భీమిలి సమీపంలోని ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు ప్రభుత్వం నడుంబిగించింది. భీమిలి హౌస్ బిల్డింగ్ సొసైటీ పనులు చేపడుతున్న ప్రాంతం సీఆర్‌జెడ్ పరిధిలోకి వస్తుందని గుర్తించిన కలెక్టర్ హరీంధిర ప్రసాద్...కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ కమిటీలో ఉన్న పలు శాఖల అధికారుల నుంచి నివేదిక కోరారు. ఈ నేపథ్యంలో గనుల శాఖ శుక్రవారం సొసైటీ పనులు చేపట్టిన ప్రాంతానికి వెళ్లినా వర్షం కారణంగా సర్వే ప్రారంభం కాలేదు. సొసైటీ లేఅవుట్‌కు జీవీఎంసీ అనుమతి ఇచ్చే ముందు సీఆర్‌జెడ్ అనుమతి ఉండాలి. అయితే సీఆర్‌జెడ్ అనుమతి లేనందున సంబంధిత శాఖలు త్వరలో సమావేశమై ఒక నివేదిక రూపొందించే పనిలో ఉన్నాయి.

ఎర్రమట్టి దిబ్బలు ఉన్న ప్రాంతంలో సుమారు 250 ఎకరాలను భౌగోళిక వారసత్వ సంపదగా 2016లో జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. దీని కంటే ముందు కొంత ప్రాంతం ఐఎన్‌ఎస్‌కు కళింగకు కేటాయించగా, కొంతమంది స్థానికులు కొద్దిభూమి ఆక్రమించుకున్నారు. కాగా, భీమిలి హౌసింగ్ సొసైటీకి గతంలో ప్రభుత్వం కేటాయించిన 373.95 ఎకరాల్లో 91.5 ఎకరాలు కూడా భౌగోళిక వారసత్వ సంపద కింద ప్రకటించిన భూమిలో ఉంది. అందువల్ల 91.5 ఎకరాలను మినహాయించి మిగిలిన 280.7 ఎకరాలు సొసైటీకి అప్పగించారు. ఈ నేపథ్యంలో సొసైటీ పెట్టుకున్న దరఖాస్తు మేరకు 240.472 ఎకరాలకు తాత్కాలిక లేఅవుట్‌కు జీవీఎంసీ గత ఏడాది ఏప్రిల్ 10న ఆమోదం తెలిపినా పలు అనుమతులు రాలేదు. అయినా పనులు కొనసాగించడంతో 'ఎర్రమట్టి దిబ్బలకు ఎసరు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ... మిగతా 6వ పేజీలో

ముసురు

నగరంలో తెరిపిలేకుండా వర్షం

- పల్లపు ప్రాంతాలు జలమయం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



బౌడరా జంక్షన్ వద్ద నిలిచిన నీరు



శుక్రవారం రాత్రి నగరంలో వర్షం

విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో నగరంలో ముసురు వాతావరణం నెలకొంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకూ జిల్లాలో తెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా వన్‌టౌన్, ఫిషింగ్ హార్బర్, రైల్వే న్యూకాలనీ, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా నీరు చేరింది. విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు.

భీమిలి మండలం పాతపరదేశిపాలెం వద్ద గంభీరం గెడ్డ పొంగిపొర్లడంతో ఐదు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కొమ్మాది, మధురవాడ పరిసర ప్రాంతాల్లో రహదారులన్నీ జలమయమయ్యాయి. మధురవాడ కూడలి, ఎత్తు వంతెన, మధురవాడ పీహెచ్‌సీ, డైలీ మార్కెట్‌లో నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. స్వతంత్రనగర్ కాలనీ, బాపూజీనగర్, పోర్టు కాలనీల్లో కొన్ని ఇళ్లు ముంపునకు గురయ్యాయి. చంద్రంపాలెం, కారుషెడ్డు ప్రాంతాల్లో సర్వీసు రోడ్లపై మోకాలు లోతు నీరు చేరింది. ఆరిలోవలోని ఆదర్శనగర్ కొండవాలు ప్రాంతంలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. 9వ వార్డు జోడుగుళ్లపాలెం కూడలి నుంచి కైలాసగిరికి వెళ్లే ప్రధాన మార్గంలో పోలీసు క్వార్టర్స్ ప్రాంతంలో చెట్టు కూలి గోడ ధ్వంసమైంది. అలానే అదేమార్గంలో కొన్నిచెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పద్మనాభం, ఆనందపురం, భీమిలి రూరల్ మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. పారిశ్రామిక ప్రాంతంలోని మల్కాపురం, గాజువాక, ఆటోనగర్, పెదగంట్యాడ, అగనంపూడి ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెందుర్తిలో కురిసిన వర్షానికి నాలుగురోడ్ల కూడలిలో భారీగా నీరు చేరింది. ఎగువ నుంచి వరద నీరు పోటెత్తడంతో గోపాలపట్నం శివారు కొత్తపాలెం-నరవ రోడ్డు మునిగిపోయింది. అక్కిరెడ్డిపాలెం సమీపంలోని గుడివాడ అప్పన్న కాలనీలో ఓ ఇంటి సన్‌షేడ్ కూలిపోయింది. కాకానినగర్- ఎన్‌ఏడీ మార్గంలో ... మిగతా 6వ పేజీలో

జిల్లాలో వర్షపాతం

పెందుర్తి వెంకటాద్రినగర్	112.25 మిల్లీమీటర్లు
గంభీరం	93 మి.మీ.లు
హెచ్‌బీకాలనీ	78.75 మి.మీ.
ఆరిలోవలో	78 మి.మీ.
గోపాలపట్నం టీటీడీ కల్యాణ మండపం	63.5 మి.మీ.

ఆర్టీసీకి ఎఫెక్ట్

- ఆదాయానికి రూ.20 లక్షల మేర గండి
- హైదరాబాద్ వెళ్లాల్సిన ఒక బస్సు రద్దు

ద్వారకా బస్‌స్టేషన్, జూన్ 19: వర్షాలతో ఆర్టీసీ ఆదాయానికి గండిపడింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంలో అనేక మంది తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. కొన్ని వ్యాపార సంస్థలను కూడా తెరవకపోవడంతో వాటికి సంబంధించిన సిబ్బంది ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసరమైన వారు తప్ప ఎవరూ ప్రయాణించేందుకు ఆసక్తి చూపలేదు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారిలో చాలామంది తమ ప్రయాణాలను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. దీంతో ఆర్టీసీకి ప్రయాణికుల తాకిడి తగ్గిపోయింది. సగటు ఆక్యుపెన్సీ రేషియో 65 శాతం ఉంటుండగా...శుక్రవారం 51 శాతం మాత్రమే నమోదయ్యింది. అలాగే సగటున రోజువారీ ఆదాయం రూ.95 లక్షలు కాగా శుక్రవారం రూ.70 లక్షలు మాత్రమే వచ్చింది. అంటే రూ.20 లక్షల మేర ఆదాయం తగ్గింది. ప్రయాణికుల లేకపోవడంతో శుక్రవారం రాత్రి విశాఖ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాల్సిన 7.00 గంటల సర్వీసును రద్దు చేశారు.



ఇనుప కంచెను తొలగిస్తున్న సిబ్బంది

ఏయూలో ఇనుప కంచె తొలగింపు

- పరిపాలనా భవనం ఎదుట గత వీసీ ప్రసాదరెడ్డి హయాంలో ఏర్పాటు
- విమర్శలు వచ్చినా పట్టని వైనం
- ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన మరుసటిరోజే తొలగించిన ప్రొఫెసర్ శశిభూషణ్

- వివరాలు మెయిన్‌లో


టౌన్ కొత్తరోడ్డులో నిలిచిన వర్షం నీరు


కేఆర్ఎం కాలనీలో యూజీడీ గోతుల్లో చేరిన నీరు

కుండపోత వర్షంతో అస్తవ్యస్తం

- రహదారులపై చేరిన నీరు
- రాకపోకలకు అవస్థలు

పూర్ణామార్కెట్: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో పూర్ణామార్కెట్ నుంచి టౌన్ కొత్తరోడ్డు వరకు రహదారులు జలమయ్యాయి. గురు, శుక్రవారం కురిసిన వర్షానికి ఇరువైపులా నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారుల ఇబ్బంది పడ్డారు. కాలువల్లో నీరు వెళ్లే మార్గం లేక పోవడడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షంనీటిలో ఎక్కడ గోతులు ఉన్నదీ తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం నీటితో వ్యాపారులూ అవస్థలు పడ్డారు. ఫుట్‌పాత్ వ్యాపారాలు పూర్తిగా మూతపడ్డాయి. రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఇందిరానగర్-3లో కూలిన గోడ పరిశీలిస్తున్న స్థానిక ప్రజా ప్రతినిధి

ఇందిరానగర్‌లో కూలిన ఇంటి గోడ

కంచరపాలెం, జూలై 19 : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 48వార్డు పరిధి ఇందిరానగర్-3లో ఓ గోడ కూలి పడడంతో పక్కనున్న ఇంటి పైకప్పు విరిగిపడింది. ఈఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కూలిన గోడలు, రక్షణ ప్రహరీల పున:నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. దెబ్బతిన్న విద్యుత్ దీపాలకు అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించారు. బాపూజీనగర్, పల్నాటికాలనీ, రాంజీ ఎస్టేట్, శ్రీనివాసనగర్, జైభారత్ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలు వర్షం ప్రభావంతో ఇళ్లకే పరిమితమయ్యారు.

యూజీడీ తవ్వకాలతో ఇబ్బందులు

సీతమ్మధార: గ్రేటర్ 23వ వార్డు కేఆర్ఎం కాలనీలో యూజీడీ పనులు చేపడుతున్నారు. గతంలో యూజీడీ గోతులు తవ్వి పైపులైన్లు వేశారు. తిరిగి వీటిని సక్రమంగా పూడ్చకపోవడంతో ఈ గోతుల్లో వర్షం నీరుచేరింది. దీంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాల బారినపడుతున్నారు. కనీసం ప్రమాద సూచికల తెలిపే బోర్డులేదు.


నరసింహనగర్ రైతుబజారులో నిలిచిన నీరు

అక్కయ్యపాలెం: వర్షానికి రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచిపోయింది. నరసింహనగర్ రైతుబజారులో ఫ్లోరింగ్ వర్షపు నీటితో నిండిపోవడంతో వినియోగదారులు ఇబ్బం ది పడ్డారు. వినియోగదారుల తక్కువ మంది రావడంతో బేరాలు లేవని రైతులు, వ్యాపారులు ఆ వేదన వ్యక్తం వ్యక్తం చేశారు.

గిరి ప్రదక్షిణకు సహకరించాలి


మాట్లాడుతున్న ఈస్ట్ ఏసీపీ జయరామ్ ప్రసాద్

సీతమ్మధార, జూలై 19: సింహాచలం గిరి ప్రదక్షిణలో పాల్గొననున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యంలేకుండా చూడాలని ఈస్ట్ ఏసీపీ జయరామ్ ప్రసాద్ సిబ్బందికి సూచించారు. నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి సుందర ఫంక్షన్ హాలులో శుక్రవారం సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. గిరి ప్రదక్షిణలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు తిరుమలరావు, శ్రీనివాస్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


నేవీ స్కూల్లో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మల్కాపురం(?) / మర్రిపాలెం, జూలై 19: 104ఏరియా విజయనగర్‌కాలనీలోని నేవీ చిల్డ్రన్స్‌లో స్కూల్లో మూడు రోజులుగా విశాఖపట్నం బేస్ విక్చువలింగ్ యార్డ్, పినాకిల్ ఆసుపత్రి సంయుక్త భాగస్వామ్యంతో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని శుక్రవారం ఈఎన్‌సీ ఆర్‌పీడీఎం ఎం.మురళీమోహన్‌రాజు సం దర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు వైద్య చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందిని సత్కరించారు. ఈకా ర్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



జగదాంబ కూడలి, జూలై 19: వన్‌టౌన్ కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేకం సేవలను నిర్వహించారు. ఉదయం 7గంట సమయంలో ఉభయదాతలతో అర్చకులు ఈ పూజలు చేయించాయి. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వి.రాంబాబు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కొండంత సంబరం

... 5వ పేజీ తరువాయి

ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గోవింద నామస్మరణలతో గిరి ప్రదక్షిణకు ఉపక్రమిస్తారు.

గిరి ప్రదక్షిణ మార్గం

తొలిపావంచా వద్ద ప్రారంభమయ్యే భక్తులు పాత అడివివరం, పైనాపిల్ కాలనీ, హనుమంతువాక, విశాలాక్షి నగర్, అప్పుఘర్, ఎం.వి.పి.కాలనీ డబుల్‌రోడ్డు, ఇసుకతోట, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, గురుద్వారా, ఆర్ అండ్ బి, ఎన్‌ఏడీ కూడలి, గోపాలపట్నం, గోశాల మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంటారు.

విస్తృత ఏర్పాట్లు

గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సంఖ్య ఏడాదిఏడాదికి పెరుగుతూ వస్తోంది. ఈ సంవత్సరం సుమారు ఎనిమిది లక్షల మంది పాల్గొనే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు ఇతర శాఖల అధికారుల సమన్వయంతో సింహాచలం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి తమ సిబ్బందితో కలిసి విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు 80 క్యూలను, 50 ఇనుప గడ్డర్లను ఏర్పాటుచేశారు. అదేవిధంగా రెండో ఘాట్‌రోడ్డు వద్ద నమూనా దేవాలయాన్ని ఏర్పాటుచేసి అక్కడ కూడా కొబ్బరికాయలు కొట్టేందుకు అనుకూల ఏర్పాట్లు చేశారు.

మార్గం పొడవునా 290 తాత్కాలిక మరుగుదొడ్లు, 29 వైద్య శిబిరాలు, 22 అంబులెన్స్‌లు, 390 ఎల్ఈడీ లైట్లు, 9 జనరేటర్లు, 6 ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లు ఏర్పాటుచేశారు. తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతలను పూర్తిస్థాయిలో జీవీఎంసీ చేపడుతోంది. అప్పుఘర్ వద్ద భక్తులు స్నానాలు చేయనున్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం వివిధ శాఖల అధికారులతో కొండదిగువన కలశం వద్ద, అడివివరం, హనుమంతువాక, అప్పుఘర్, మాదవధార, ఎన్ఎస్‌టిఎల్ గేటు వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్‌లు సిద్ధం చేశారు. ఐదు డ్రోన్ కెమెరాలతో ఉత్సవాన్ని చిత్రీకరణకు ఏర్పాట్లు చేశారు. 20వ తేదీ ఉదయం 6 నుంచి 21వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు 98వ వార్డు పరిధిలోని మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. కొండ దిగువన 29 ప్రదేశాలలో, సింహగిరిపై మూడు ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేకంగా ఫోన్ నంబర్లు

గిరి ప్రదక్షిణ నేపథ్యంలో దేవస్థానంతోపాటు పలు ప్రభుత్వ శాఖలు భక్తులకు అవసరమైన సలహాలు, సేవలు అందించేందుకు ప్రత్యేకంగా కొన్ని ఫోన్ నంబర్లు ఏర్పాటుచేశాయి. సింహాచలం దేవస్థానం (0891-2954944), జీవీఎంసీ (1800-42500009), నీటి సరఫరా, ప్రజా ఆరోగ్యశాఖలు (0891-2869111), విశాఖ పోలీస్ శాఖ (9390105353 లేదా 9330105355)

గిరి ప్రదక్షిణ భక్తులకు వర్షసూచన

విశాఖపట్నం : గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు వర్షం కొంతవరకు అంతరాయం కలిగించే అవకాశం ఉంది. శనివారం తెల్లవారుజామున పూరి సమీపంలో తీరం దాటనున్న వాయుగుండం పశ్చిమ వాయువ్యంగా పయనించి ఛత్తీస్‌గఢ్ మీదుగా రానున్న నేపథ్యంలో తేమగాలులు భూ ఉపరితలంపైకి వీస్తాయి. దీంతో శనివారం ఉదయం 11.30 గంటల వరకు వర్షం కొనసాగుతుందని, ఆ తరువాత మెల్లగా తగ్గుతూ దఫదఫాలుగా జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అందువల్ల భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

అంతరాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, జూలై 19: గిరి ప్రదక్షిణ, తుదివిడత చందన సమర్పణ కార్యక్రమాల నేపథ్యంలో శని, ఆదివారాల్లో సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి అంతరాలయ దర్శనాలు, అన్నిరకాల ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు నీలాద్రిగుమ్మం వద్ద నుంచే లఘు దర్శనం కల్పిస్తామన్నారు. శనివారం ఉదయం 6.30 నుంచి 2.30 గంటల వరకు, 3 నుంచి రాత్రి 7 గంటల వరకు, 8.30 నుంచి తిరిగి 10 గంటల వరకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. ఆషాఢ పౌర్ణమి రోజున (ఆదివారం) వేకువజామున 2.00 గంటలకు సుప్రభాత (ఏకాంత) సేవ, అనంతరం 3.00 గంటల వరకు స్వామి వారికి తుదివిడత చందన సమర్పణ జరుగుతుందన్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయ ప్రాకారం చుట్టూ ప్రదక్షిణకు అనుమతిస్తామని చెప్పారు. ఉదయం 5.00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకూ నిర్విరామంగా భక్తులకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి. సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ఆలయ బేడా మండపంలో డిల్లీ విజయం ఉత్సవం నిర్వహించనున్నందున భక్తులకు దర్శనాలు లభించవు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు, తిరిగి రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు భక్తులకు దర్శనాలు లభిస్తాయి. భక్తుల రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో ఎటువంటి సిఫారసు లేఖలు అనుమతించబడవని ఈవో పేర్కొన్నారు. భక్తుల రద్దీతో సింహగిరిపైకి ఎటువంటి వాహనాలను అనుమతించరని, దిగువన ఏర్పాటుచేసిన పార్కింగ్ స్థలాల్లో తమ వాహనాలను నిలిపి దేవస్థానం ఏర్పాటుచేసిన వాహనాలలో మాత్రమే రాకపోకలు సాగించాలని ఈఓ కోరారు.

గ్రేటర్‌పై టీడీపీ దృష్టి

... 5వ పేజీ తరువాయి

వచ్చేందుకు సిద్ధమైన 22 మంది కార్పొరేటర్లనూ తీసుకోవాలని నిర్ణయించారు. వైసీపీ నుంచి ఎవరెవరిని తీసుకోవాలనే విషయమై ఎమ్మెల్యేలు గురువారం రాత్రి సమావేశంలో చర్చించారు. అయితే ఆ జాబితాలో ఉన్న ఒకరిద్దరిని పక్కనపెట్టాలని కొందరు ప్రతిపాదించారని తెలిసింది. పార్టీలోకి ఇష్టపూర్వకంగా వచ్చేవారిని మాత్రమే తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 21వ తేదీ ఆదివారం వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరున్నట్టు సమాచారం. తరువాత జీవీఎంసీ సాధారణ సమావేశం నిర్వహణ తేదీ ప్రకటించే అవకాశం ఉంది. దీనిలో భాగంగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నారు.

ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు కార్యాచరణ

... 5వ పేజీ తరువాయి

ప్రచురించడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. జాయింట్ కలెక్టర్ ఆ ప్రాంతాన్ని సందర్శించి సొసైటీ పనులను నిలిపివేయాలని ఆదేశించారు. అసలు ఆ లేఅవుట్‌కు సీఆర్‌జెడ్ అనుమతి ఇవ్వాలంటే కలెక్టర్ అధ్యక్షతన కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ కమిటీలో చర్చించి కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖకు సిఫారసు చేయాలి. కానీ అటువంటి అనుమతులు లేవని నిర్ధారించారు. ఇదిలా వుండగా భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తించిన 250 ఎకరాలకు సరిహద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ లేదా సరిహద్దులు తెలిపేలా స్తంభాలు ఏర్పాటుచేస్తే వివాదాలకు తెరపడుతుందని అధికారులు యోచిస్తున్నారు. దీనికి అనుగుణంగా త్వరలో సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని భావిస్తున్నారు. అనంతరం పలువురి ఆక్రమణలో ఉన్న భూములు స్వాధీనం చేసుకునే దిశగా చర్యలు తీసుకోనున్నారు. ఐఎన్ఎస్ కళింగకు ఇచ్చిన భూమి వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదని దానిని తప్పించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భీమిలి సొసైటీకి ఇచ్చిన భూమి వెనక్కి తీసుకుని ప్రత్యామ్నాయంగా మరోచోట ఇస్తే ఎలా ఉంటుందని అధికారులు ఆలోచిస్తున్నారు. భూమి వివాదంలో సొసైటీ సుప్రీంకోర్టుకు వెళ్లి అనుమతులు పొందిన విషయాన్ని జిల్లా యంత్రాంగం పరిగణనలోకి తీసుకుని అటు సొసైటీకి ఇబ్బంది లేకుండా ఇటు భౌగోళిక వారసత్వ సంపదకు ప్రమాదం వాటిల్లికుండా ఎలా ముందుకువెళ్లానే అంశంపై త్వరలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ముసురు

... 5వ పేజీ తరువాయి

భారీ వృక్షం నేలకూలింది. రానున్న రెండు రోజులు కూడా చిరుజల్లులు నుంచి ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అల్పపీడనం నేపథ్యంలో సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లాలో గత రెండు రోజులుగా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వాసులు ఎటువంటి సమస్య తలెత్తినా కంట్రోల్ రూమ్ (0891-2590102, 0891-2590100)కు తెలియజేయవచ్చునన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష

భారీవర్షాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి నష్టం జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విశాఖ నుంచి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పాల్గొన్నారు.

'పోర్టు ట్రస్ట్ వాహనాల కట్టడికి చర్యలు తీసుకోవాలి'

పూర్ణామార్కెట్, జూలై 19: జనావాసాల మధ్యనుంచి వెళ్తున్న విశాఖ పోర్టు ట్రస్ట్‌కు చెందిన టిప్పరు, ఇతర భారీ వాహనాలతో తలెత్తుతున్న ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విల్లూరి మాట్లాడుతూ, పోర్టుట్రస్ట్ ట్రాన్స్‌పోర్టు విభాగం అనాలోచిత విధానాలతో వెలంపేట, పాతబస్టాండ్, స్టేడియంరోడ్డు పరిసర ప్రాంతాలకు చెందిన నివాసితులకు రాత్రి వేళల్లో కంటిమీద కునులేకుండా పోతుందని స్పష్టం చేశారు. పోర్టు టిప్పర్ల శబ్దంతో పగలురాత్రి రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. గత నెలరోజులుగా ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు వివరించారు. భారీ వాహనాలతో రోడ్లు దారుణంగా మారాయన్నారు. టిప్పర్లతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరి అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయన్నారు. పోర్టు ట్రస్ట్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి ఈ భారీ వాహనాలను నిరోధించేలా చర్యలు తీసుకోవాలని సీతంరాజు సుధాకర్‌ను కోరారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నిరాశ్రయుల షెల్టర్లను అభివృద్ధి చేయాలని వినతి


మంత్రి దుర్గేశ్‌కు వినతి పత్రం అందిస్తున్న వాసు

అక్కయ్యపాలెం, జూలై 19: వలస కార్మికులకు కేరళ తరహా వర్కింగ్ హాస్టల్స్, నిరాశ్రయులకు పర్మినెంట్ షెల్టర్లు అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌ను ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఈ విషయాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. అలాగే, గత ప్రభుత్వం మున్సిపాలిటీల జనరల్ ఫండ్స్ రూ. 1,952 కోట్లు దారి మళ్లించిందన్నారు. దీంతో రాష్ట్రంలోని 89 నిరాశ్రయ వసతి గృహాలకు నిధులు మంజూరు కాలేదని, ఆలాగే, వాటిని రెన్యువల్ చేయలేదని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జాతీయ పట్టణ ఉపాధి మిషన్ (ఎన్‌యూఎల్ఎం) నిధులను కేంద్ర ప్రభుత్వంనుంచి తీసుకురావాలని కోరారు. గతంలో సుప్రీం కోర్టు తీర్పు మేరకు విశ్రాంత ఐఏఎస్ అధి కారితో జేసీ శర్మ కమిటీ నియమించిందని, 2020లో శర్మ రాజీనామాతో కార్యకలాపాలు ముందుకుసాగడంలేదన్నారు. వెంటనే ఈ కమిటీని నియమించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు పెరుగుతున్న వలసల నివారణ, ఇతర సమస్యలపై డిప్యూటీ సీఎంతో సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఆప్సా ప్రతినిధుల వినతి


వంశీకృష్ణకు వినతి ప త్రమిస్తున్న ఆప్సా ప్రతినిధులు

మహారాణిపేట, జూలై 19: ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య అసోసియేషన్ నాయకులు దక్షిణ ని యోజకవర్గ శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీని వాస్‌ను కోరారు. శుక్ర వారం ఎమ్మెల్యేను విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలసి వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చీకటి రమేష్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. శ్రీనివాస్ , డి.ఎ. శ్రీనివాస్,ఎం శ్రీనివాస్, పి. గోవింద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో మంత్రి శ్రీనివాస్

గాజువాక, జూలై 19: మెడ్‌టెక్ జోన్‌ను శుక్రవారం ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు. వైద్య పరికరాల తయారీ, వసతులు, కంపెనీ ఆపరేషన్ ప్రక్రియలను తెలుసుకున్నారు. అనంతరం పలువురు సీఈవోలతో భేటీ అయ్యారు. ఉద్యోగులు, కంపెనీల వివరాలు, అందుతున్న సౌకర్యాలపై చర్చించారు. మార్కెటింగ్ ట్రెండ్ ఇతర అంశాలపై మాట్లాడారు. ఆయన వెంట విశాఖ, అనకాపల్లి జిల్లాల పరిశ్రమల శాఖ అధికారులు గణపతి, శ్రీధర్ ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సాయి ధ్యాన మందిరంలో గురు పౌర్ణమికి ఏర్పాట్లు

అక్కయ్యపాలెం, జూలై 19: గురుపౌర్ణమి వేడుకలకు (ఈనెల 21తేదీన) గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి బాబా ధ్యానమందిరం సిద్ధమవుతోంది. 1994లో విజయదశమి రోజున స్వామి విగ్రహ ప్రతిష్ఠతో చిన్న ఆలయంగా ప్రారంభమై అనంతరం దాతల సహకారంతో అభివృద్ధి చెందింది. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, టి.రాంబాబు నేతృత్వంలో 30 ఏళ్లుగా మందిరంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ మందిరంలో నల్లరాతి విగ్రహం ప్రత్యేకం.

14 ఏళ్లుగా నిత్యాన్నదానం

మందిరంలో 2010 నుంచి నిత్యాన్నదానం దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. రోజూ 100 నుంచి 150 మంది భక్తులు, యాచకులకు, నిరుపేదలకు అన్నప్రసాదం పెడుతున్నారు. గత 16 ఏళ్ల నుంచి ప్రతి గురువారం ఉచిత వైద్య పరీక్షలతోపాటు రక్తదాన శిబిరాలు కొనసాగిస్తున్నారు. వృద్ధులకు పెన్షన్లు అందిస్తున్నారు.


షిర్డీసాయి నల్లరాతి విగ్రహం


విద్యుద్దీపాలతో రైల్వే కాలనీలోని ఆలయం

గత మూడేళ్లుగా కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లను ఏర్పాటు చేసి రాత్రి వేళల్లోనూ ఆకలితో ఉన్న వారికి ఆహారం అందిస్తున్నారు.

భక్తులకు తీర్థయాత్రలు

1994 నుంచి ఏటా డిసెంబరులో ధ్యానమందిరం ఆధ్వర్యంలో భక్తులకు షిర్డీ, కాశీ, రామేశ్వరం యాత్రలకు తీసుకెళ్తున్నారు. ఉచితంగా వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం భక్తుల స్వహస్తాలతో బాబాకు క్షీరాభిషేకం, సాయంత్రం పల్లకీ మహోత్సవం ఉంటుంది.

రైల్వే శాఖకు కేటాయించిన స్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే. జీవీఎంసీ అధికారులు

ఆరిలోవ, జూలై 19 : ముడసర్లోవలో రైల్వే శాఖకు జీవీఎంసీ కేటాయించిన స్థలాన్ని రైల్వే శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. సర్వే నెంబరు 26లో సుమారు రెండు ఎకరాలను రైల్వే శాఖకు కేటాయించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జోన్ టు టౌన్ ప్లానింగ్ ఏసీపీ రైల్వే అధికారులకు ఆ స్థలాన్ని చూపించారు. భూమి బదలాయింపులో భాగంగా ముడసర్లోవ భూములను జీవీఎంసీ రైల్వే శాఖకు కేటాయించింది.

క్రీడలకు ఐవోఎల్ సహకారం

మహారాణిపేట, జూలై 19: సామాజిక పరివర్తనలో భాగంగా దేశ వ్యాప్తంగా క్రీడల ప్రోత్సాహానికి ఐవోఎల్ సహకారాన్ని అందిస్తుందని సంస్థ ప్రతినిధి ఎస్. సెల్వకుమార్ తెలిపారు. శుక్రవారం దసపల్లా హిల్స్ లో జరిగిన సమావేశంలో ఆయన మా ట్లాడారు. ఉమీద్ ఏ హోప్ ప్రాజెక్టు ద్వారా ఎందరో జీవితాలలో వెలుగు నింపుతుందని లిపారు. ఖైదీలు, బాల నేరస్తుల్లో పరివర్తనకు స్పోర్ట్స్ కోచింగ్ పరికరాలను అందించనున్నట్లు చెప్పారు. వారు కొత్త జీవితంలోకి అడుగు పెట్టెందుకు ఆన్‌లైన్ ద్వారా చెస్ పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ సహాయ సహకారాలను అందిస్తున్నట్లు వివరించారు.

రైతుబజారుల్లో సబ్సిడీపై టమాటా విక్రయాలు

అక్కయ్యపాలెం, జూలై 18 : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో సబ్సిడీపై టమాటా కిలో రూ.58కి విక్రయాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ వాణి జ్య మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఎస్‌కే యాసీన్ టమాటా విక్రయిస్తున్న స్టాళ్లను సందర్శించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టమాటా విక్రయించాలని డ్వాక్రా గ్రూపుల వ్యాపారులకు సూచించారు. ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

కొనుగోలుదారులు హర్షం

కంచరపాలెం : కంచరపాలెం రైతుబజారులో ప్రభుత్వం శుక్రవారం నుంచి పంపిణీ చేస్తున్న సబ్సిడీ టమాటా కొనుగోలుకు వినియోగదారులు ఆసక్తి చూపారు. బజారుకు టమాటా 26 క్వింటాళ్లు రాగా, వాటిలో 18 క్వింటాళ్లు విక్రయించారు. కిలో టమాటా బయట మార్కెట్‌లో రూ.70 నుంచి రూ.75 ధర ఉంది. రైతుబజారుల్లో కిలో రూ.58కే అందిస్తున్నారు. దీంతో పేద,మధ్య తరగతి కొనుగోలు దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై కందిపప్పు, టమాటా, బియ్యం అందిస్తుండడంతో అభినందనీయమని పలువురు కొనియాడారు.


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఏడీ యాసీన్




శాకంబరిగా దుర్గమాంబ

అగనంపూడి, జూలై 19: అగనంపూడి దుర్గమాంబ ఆలయంలో ఆషాఢమాస శుక్రవారం సందర్భంగా అమ్మవారిని శాకంబరీగా దేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి చీరలు పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయ ప్రాంగణంలో లలితా సహస్రనామ, విష్ణు సహస్ర పారాయణాన్ని పఠించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం

పెందుర్తి, జూలై 19: స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వర స్వామికి శుక్రవారం శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వేకువ జామున మూలవి రాట్టుకు అభిషేకాలు చేసిన అనంతరం సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.



అభిషేకం చేస్తున్న దృశ్యం

'జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటుచేయాలి'

అక్కిరెడ్డిపాలెం, జూలై 19: పారిశ్రామిక ప్రాంతంలో జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌ను 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి శుక్రవారం కలిసి విన్నవించారు. వీధి కుక్కలు, ఇతర జంతువులతోపాటు అనారోగ్యానికి, ఇతర కారణాలతో యజమానుల విడిచిపెడుతున్న పెంపుడు కుక్కలతో జనం తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. వీధుల్లో పిల్లలు, ఒంటరిగా ప్రయాణించే మహిళలు, వృద్ధులపై ఇవి దాడి చేస్తున్నాయన్నారు. వీటినుంచి రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

తక్షణమే జీతాలు చెల్లించండి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 19: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. ప్లాంట్ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. కార్మికులకు ఇప్పటివరకు జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. దేశ వ్యాప్తంగా స్టీల్ కార్మికులు కొత్త జీతాలు తీసుకుంటుండగా, విశాఖలో మాత్రం పాత జీతాలనే ఇస్తోందన్నారు. ఇకనైనా జీతాలు చెల్లించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.టి.దాసు, శ్రీనివాసరాజు, అప్పారావు, గంగాధర్, రాజు, పుల్లారావు పాల్గొన్నారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జూలై 19: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ప్రత్యేక వేదికపై అధిష్టింపజేసి భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంతరం ఆగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువును నిర్వహించారు.

సినిమా గైడ్

● **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)

● **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),

● **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),

● **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 58, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 18, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 40, బీరకాయలు 28, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజి 34, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 30, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 90, అల్లం 140, బరబాటి 30, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోసకాయలు 16, వెల్లుల్లి 180, కొబ్బరికాయ 23, బీన్స్ 80, పొటల్స్ 38, కీరదోస 26, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 62, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



జిలా కార్యాలయం రహదారిని ముంచెత్తిన వరద నీరు



జలమయమైన కొత్తపాలెం-నరవ రహదారి

కుండపోత వర్షం... స్తంభించిన జన జీవనం

మల్కాపురం, జూలై 19: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాఠశాలలు, హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డు, డాక్‌యార్డు, కోరమాండల్ ఎరువుల కర్మాగారం తదితర పరిశ్రమలకు సెలవులు ప్రకటించారు. పారిశ్రామిక ప్రాంతంలో వర్షం నీరు నిలిచిపోయింది. కొండలపై నివాసితులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.గతంలో జరిగిన ప్రమాదాలను గుర్తుచేసుకుంటున్నారు. రక్షణగోడలు నిర్మించాలని ఏళ్లుగా కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

పెందుర్తిలో తెరిపివ్వని వర్షం

పెందుర్తి: పెందుర్తి పరిసరాల్లోని పలుకాలనీల్లో రహదారులు చిత్తడిగా మారాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. నాలుగు రోడ్ల కూడలి జలమయమైంది. నీరు వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిలిచిపోతోంది. జనజీవనం స్తంభించింది. కూలీలకు ఉపాధి లేకుండా పోయింది.

చెరువులను తలపిస్తున్న కాలనీలు

ఆటోనగర్: పారిశ్రామిక ప్రాంతం తడిసి ముద్దయింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోనగర్, తోకాడలో రహదారులు దారుణంగా మారాయి. అవుట్ లెట్ సమస్యతో రహదారులు, ఇళ్లల్లోకి వర్షం నీరు చేరుతోంది. ఇటీవల గ్రామంలో చేపట్టిన డ్రైనేజీలు, రహదారులు నాసిరకంగా ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు.

కూర్మన్నపాలెంలో...

సిద్ధార్థనగర్ వాటర్ ప్లాంట్, ఫకీర్‌తఖ్యా, రాజీవ్ నగర్, రాసాలమ్మకాలనీ, ఎన్టీఆర్‌నగర్, కణితి, వడ్లపూడి, ఉప్పరకాలనీ, యాతపాలెం, కాపు జగ్గరాజుపేట, శ్రీనగర్, కుంచుమాంబ కాలనీ, రేడియో స్టేషన్ రోడ్, సాయిరాంనగర్ రహదారులపై వర్షం నీరు వరదలా ప్రవహిస్తోంది. కాలువల్లోని వ్యర్థాలు రోడ్లపైకి చేరుకున్నాయి. దువ్వాడ నుంచి మంగళపాలెం, కూర్మన్నపాలెం, కాపుజగ్గరాజుపేట మీదుగా హైవేకు వెళ్లే మార్గంలో నీరు నిలిచిపోయింది.

నేలకూలిన భారీ వృక్షం

ఎన్ఏడీ జంక్షన్: గణేష్‌నగర్, ఉడాకాలనీ, సంజీవయ్య కాలనీ, ఎన్.ఎస్.టి.ఎల్. గేటు పరిసరాలు, వినోద్‌నగర్, సాకేతపురం, కాకానినగర్, విమాన్‌నగర్ శివారు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద వర్షంతో వాహనాలు నిలిపివేశారు. దినసరి కూలీలు పనిలేక నిరాశతో వెనుదిరిగారు. బుచ్చిరాజుపాలెం బీఆర్‌టీఎస్ బస్టాప్, సర్వీస్ రోడ్డులో నీరు నిలిచిపోయింది. కాకానినగర్ హైవేలో విమాన్‌నగర్ ఎన్.ఎ.డి మార్గంలో భారీ వృక్షం కూలిపోయింది. దీంతో వాహనాలను రెండు గంటలపాటు దారి మళ్లించారు. బాజీజంక్షన్ నుంచి పాతగోపాలపట్నం మార్గంలో వర్షం నీటితో ఇబ్బంది నెలకొంది. గిరి ప్రదర్శనలో పాల్గొనే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పనకు నమూనా పార్కువద్ద ఏర్పాటుచేసిన స్టాల్ వర్షానికి కూలిపోయింది.



గాజువాక పోలీస్ స్టేషన్ సెల్లార్‌లో నిలిచిన నీరు



జలమయమైన పెందుర్తి నాలుగురోడ్ల కూడలి

జలమయమైన లోతట్టు ప్రాంతాలు

వేపగుంట: నాయుడుతోట, వేపగుంట, అప్పన్నపాలెం శివారు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాయుడు తోట కొండ వాలు నుంచి వచ్చే వర్షం నీరు వెంకటసాయినగర్, లారీ గోడౌన్ ప్రాంతాల్లో చేరి, ఇసుకమేటలు వేయడంతో రాకపోకలకు అవస్థలు ఏర్పడ్డాయి. అప్పన్నపాలెం, పంచాయతీకాలనీ, శ్రీనివాసనగర్ కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అగనంపూడిలో భారీ వర్షం..

అగనంపూడి: అగనంపూడి, పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇటీవల వరకు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడిన జనాలకు ఈ వర్షం ఊరట నిచ్చింది. కూలీలు, కార్మికులు పనులు లేక అవస్థలు పడ్డారు. జాతీయ రహదారిలో అగనంపూడి ఆస్పత్రి వద్ద డ్రైనేజీ పొంగి ప్రవహించింది. దువ్వాడ వెళ్లే మార్గంలో కోళ్ల ఫారాల వద్ద, నిర్వాసిత దిబ్బపాలెం రహదారుల వద్ద నీరు నిలిచిపోయింది. నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీల్లోని మురుగు రోడ్లపైకి రావడంతో దుర్గంధం వ్యాపిస్తోంది.

పారిశ్రామిక ప్రాంతంలో

గాజువాక: పారిశ్రామిక ప్రాంతంలో ఎడతెరిపి లేని వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండిపోవడంతో నివాసితులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. పాతగాజువాక, స్వతంత్రనగర్, రిక్షాకాలనీ, హెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో నీరు చేరింది. గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లోకి వర్షం నీరు ప్రవేశించింది.

అప్పన్నకాలనీలో కూలిన సన్‌షేడ్

అక్కిరెడ్డిపాలెం: గ్రేటర్ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో ఆర్.నూకరాజు ఇంటి సన్‌షేడ్ కూలిపోయింది. మధ్యాహ్నం పెద్ద శబ్దం రావడతో నూకరాజు కుటుంబ సభ్యులు బయటకు వచ్చేయడంతో ప్రమాదం జరగలేదు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, నేతలు గండికోట తాతారావు, గోవిందు బాధితులను పరామర్శించారు. కాలనీలో శిథిలావస్థకు చేరిన మరో నాలుగు ఇళ్లవారిని సచివాలయ సిబ్బంది అప్రమత్తం చేశారు.

ఛిద్రమైన రహదారులు

పెదగంట్యాడ: నిర్వాసిత కాలనీల్లోని రోడ్లలో నీరు నిలిచి పోయింది. పారిశ్రామికవా ప్రధాన రహదారి, హౌసింగ్ బోర్డు కాలనీలో డ్రైనేజీలు ఎత్తుగా ఉండటం, డెబ్రిస్ ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో నీరు నిలిచి పోయింది. హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్డుకు ఒకవైపే డ్రైనేజీ ఉంది. నీరు డ్రైనేజీలో చేరేందుకు వీలులేకుండా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. పాదచారులు, వాహనచోదకులు ప్రత్యామ్నాయ మార్గాల గుండా గమ్యస్థానాలకు చేరాల్సి వచ్చింది. తీవ్ర దుర్గంధం వ్యాపించడంతో నివాసితులు అవస్థలు పడ్డారు. ఎడతెరిపి లేని వర్షం కారణంగా దిబ్బపాలెం రోడ్డు గోతులమయంగా మారింది. ఈ గోతుల్లో వర్షం నీరు చేరడం, వాటి మీదుగానే వాహనాలు రాకపోకలు సాగించడంతో గోతులు మరింత పెద్దవిగా మారాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. గోతుల్లో పడి ప్రమాదాలు సంభవిస్తాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

జలమయమైన కొత్తపాలెం-నరవ రోడ్డు

గోపాలపట్నం: ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే కాలువలతో పాటు, కొండవాలు ప్రాంతాల వరదనీటితో గోపాలపట్నం దిగువ ప్రాంతమైన కొత్తపాలెం గ్రామ శివారు జలమయమయింది. దీంతో గోపాలపట్నం కొత్తపాలెం, నరవ గ్రామాల మీదుగా సబ్బవరం బైపాస్‌కి వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు సజావుగా సముద్రంలోకి వెళ్లేలా కాలువలు నిర్మించాలంటున్నారు.



గుడివాడ అప్పన్న కాలనీలో కూలిన సన్‌షేడ్



కాకానినగర్ రహదారిపై విరిగిపడిన చెట్టు



నీట మునిగిన కొత్తపాలెం శివారు ప్రాంతం

ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపడితేనే మనుగడ

ఇంకుడు గుంతలతో భూగర్భ జాలాల పెరుగుదల

ప్రతి ఇంట్లో తప్పనిసరిగా తవ్వితే మేలు

భవిష్యత్తు నీటి అవసరాలను తీర్చేందుకు వీలు

కూర్మన్నపాలెం, జూలై 19: భవిష్యత్తు తరాల వారికి తగినంత నీటిని అందించాలంటే ప్రస్తుత సమాజం మేల్కొనాలి. ఇందులో భాగంగా నీటిని పొదుపుగా వాడడం, వాన నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించడం అత్యంత కీలకం. ఆ దిశగా పలువురు కృషి చేస్తున్నారు. వీఎంసీ 87వ వార్డు తిరుమల నగర్‌లో నీటి కొరతను అధిగమించేందుకు జీవీఎంసీ సూచనలతో, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధుల సహకారంతో పార్కుల్లో నలువైపులా తవ్విన ఇంకుడు గుంతలులో వర్షంనీరు చేరింది. భూగర్భ జలాలు పెరిగి ఇంకుడు గుంతల్లోకి నీరు రావటంతో కాలనీ వాసుల వారి ప్రయత్నం సఫలీకృతమైందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోడ్డులోను ఇంకుడు గుంతలు తవ్వటం ద్వారా నీటి ఎద్దడి నుంచి కాలనీ వాసులు బయట పడ్డారు.

తిరుమల నగర్ కాలనీలో ఇంకుడు గుంతలు

సొంత ఇళ్లల్లో 98, రహదారులు పక్కన 42, పార్కుల్లో 20 ఇంకుడు గుంతలు తవ్వారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా గుంతల్లో పూర్తిస్థాయిలో నీరు చేరింది. ఫలితంగా నీరంతా భూమిలోకి ఇంకి భూగర్భ జలాల పెంపునకు సహకరిస్తుందని కాలనీ వాసులు చెబుతున్నారు. నగరంలోని అన్ని కాలనీల వారూ అనుసరించాలంటున్నారు.



నీటితో నిండిన ఇంకుడు గుంత



తిరుమలనగర్‌లో ఫలితమిస్తున్న ఇంకుడు గుంతలు

అవగాహన కల్పించడం ఆనందం

నీటి ఎద్దడి నివారణకు సొంత ఇళ్లల్లో, పార్కుల్లో, రహదారుల పక్కన ఇంకుడు గుంతలు తవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించడం చాలా ఆనందంగా ఉంది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నా కృషిని గుర్తించింది. నీరే ప్రాణాధారమని, ఇళ్లల్లో వినియోగిస్తున్న నీరు వృధా కాకుండా భూగర్భంలోకి పంపించాలని, ఇంకుడు గుంతలు పై తరచూ ప్రజలకు అవగాహన కలిగేలా ర్యాలీలు నిర్వహిస్తున్నాం. తిరుమలనగర్‌లో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత ఉండేలా ఇంటి యజమానులకు సూచిస్తున్నాం.

- ఎం.పరమానందం, తిరుమల నగర్



గురు పౌర్ణమికి సిద్ధమవుతున్న ఆలయాలు



విద్యుత్ దీపాలంకరణలో శాతవాహన నగర్ షిర్డీ సాయిబాబా ఆలయం



శ్రీహరిపురం ఆలయంలో కోలాటం ఆడుతున్న మహిళలు

కూర్మన్నపాలెం, జూలై 19: ప్రసిద్ధి చెందిన గ్రేటర్ 86 వార్డు శాతవాహన నగర్‌లో శ్రీ షిర్డీ సాయి ఆలయం గురుపౌర్ణమికి ముస్తాబైంది. ఈ మం దిరంలో అప్పటి కప్పుడు రొట్టెలు తయారు చేసి దేవునికి నైవేద్యంగా సమర్పిస్తారు. వేలాది మంది భక్తులకు వీటిని పంపిణీ చేస్తారు. ఈ నేపథ్యంలో ఈ మందిరంలో గురుపౌర్ణమికి ప్రత్యేక ఉంది. ఈ నేపథ్యంలో 24 గంటల పాటు సాయి నామ సంకీర్తనలు నిర్వహిస్తున్నారు. పౌర్ణమిరోజు సుమారు 30 మ ంది రొట్టెలను తయారు చేసి అందిస్తుంటారు. గత 20 ఏళ్లుగా ఈ మందిరంలో స్వామి నిత్య పూజలు అందుకుంటున్నారు. ఆదివారం ఆలయానికి గాజువాక పరిసర ప్రాంతాలు భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకుంటారు. గురుపౌర్ణమి రోజున సాయి నామస్మరణం నిర్వహిస్తారు. సుప్రభాత సేవ, చండీ పారాయణం, వందలాది కలశాలతో పాలాభిషేకాలు, బంగారు, వెండి పుష్పాలతో అర్చనలు నిర్వహిస్తారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రారంభమైన వేడుకలు

మల్కాపురం : శ్రీహరిపురం మహాత్మాగాంధీ మార్కెట్‌లో వెలసిన షిర్డీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు శుక్రవారం ఉ దయం ప్రారంభమయ్యాయి. భక్తులు బాబాను దర్శనం చేసుకున్నారు. సాయంత్రం వెంకన్నపాలెంనకు చెందిన కోలాట బృందం ఆలయ ఆవరణలో ప్రదర్శన నిర్వహించింది. 20వ తేదీన బాబాకు విభూతితో మహాషేకం, 21న గురుపౌర్ణమి రోజున ప్రత్యేకఅభిషేకాలు, సాయంత్రం పల్లకీ సేవ ఉంటుంది. ప్రతిరోజూ స్వామి వారికి పంచామృతాభిషేకాలు, పండ్లరసాలు, సుగంధ ద్రవ్యాలతో భక్తుల స్వహస్తాలతో అభిషేకాలకు నిర్వహించేలా మందిరం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

రెండు నెలలుకే రోడ్డుకు తూట్లు

» **రూ.30 లక్షల జీవీఎంసీ నిధులతో పనులు**

» **నాసిరకంగా నిర్మించిన కాంట్రాక్టరు**

పెందుర్తి, జూలై 19: నగర పరిధి 96వ వార్డులోని పెందుర్తి ప్రశాంతినగర్ నుంచి బాలాజీనగర్ వరకు రెండు నెలల కిందట వేసిన తారురోడ్డు చిన్నపాటి వర్షానికే తూట్లు పడింది. ఈ రోడ్డు నిర్మాణానికి జీవీఎంసీ రూ.30 లక్షలు మంజూరు చేసింది. అయితే ఎన్నికల ముందు హడావుడిగా పనులు చేపట్టడం, నాసిరకంగా కాంట్రాక్టరు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడమే దీనికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తారు రోడ్డుకు తూట్లు పడి పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది కాసులకు కక్కుర్తి పడడంతోనే కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా రోడ్డు వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



వర్షానికి రోడ్డుపై పడిన గొయ్యి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన నేతలు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 19: విశాఖ విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జటోతు హుస్సేన్‌ను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు శుక్రవారం విమానాశ్రయంలో కలిశారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మాట్లాడారు. శనివారం స్టీల్‌ప్లాంట్‌కు హుస్సేన్ రానున్నట్టు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులతో మాట్లానున్నట్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య తెలిపారు. హుస్సేన్‌ను కలిసిన వారిలో ఎస్.సత్యనారాయణ, కె.వి. రత్నం, ఫణీంద్రబాబు, మోహన్‌బాబు, పుల్లారావు, నాయక్ ఉన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

గాజువాక, జూలై 19: స్టీల్‌సిటీ ఐటీఐలో మోటారు మెకానిక్ శిక్షణ పూర్తి చేసుకున్న 18మంది విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. హ్యూండాయ్ ఇండియా లిమిటెడ్ టీపీఎస్‌ఎం జానీ అక్రమ్, రీజినల్ మేనేజర్ ప్రతాప్, ఐటీఐ ఐఎంసీ చైర్మన్ ఎ.కె. బాలాజీ, ప్రిన్సిపాల్ కె.ఎస్. శ్రీనివాస్‌లు వీటిని ప్రదానం చేసి మాట్లాడారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు లక్ష్మీ హ్యుండాయి జీఎం ఎం.డి.ప్రసాద్ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

'విజయం సాధించాలంటే ప్రేరణ అవసరం'

మల్కాపురం, జూలై 19: జీవితంలో విజయం సాధించడానికి స్వీయ ప్రేరణ ఎంతో అవసరమని సీనియర్ హిందీ అధ్యాపకురాలు ఎ.ఆదిలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అడ్డంకులను అధిగమించినప్పుడే బలమైన వ్యక్తిత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ క్లెసిన్స్, అధ్యాపకురాలు రోజా, సదస్సు కో - ఆ ర్డినేటర్లు ఈపీఎస్ భాగ్యలక్ష్మి, ప్రేమలత, ప్రశాంతి, అంజలిదేవీ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'లో ఆదాయపు పన్నుశాఖపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆదాయపు పన్ను శాఖ అధికారులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 19: ఆదాయపు పన్ను శాఖపై అవగాహన కార్యక్రమాన్ని స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం నిర్వహించారు. ప్లాంట్ అడ్మిన్ భవనం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ ఐ.మధుసూదనరావు, అసిస్టెంట్ కమిషనర్ పి.వి. శేషగిరిరావు పాల్గొని, పన్ను వర్తింపు, సడలింపులు, మార్పులు తదితర విషయాలు వివరించారు. ఈ ఫైలింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియ, ముందుగా రిటర్న్‌లు స మర్పించే ప్రతి ఆర్థిక లాభాలు, అప్పీల్ దాఖలు తదితర అంశాలపై ఆ యన మాట్లాడారు. పలువురు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ప్రాజెక్టు సీజీఎం ఇన్‌చార్జి వీఆర్.బాపారావు, అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి : మేయర్

వెంకోజీపాలెం/విశాలాక్షినగర్, జూలై 19 : గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె సింహాచలం తొలి పావంచ నుంచి అడవివరం, హనుమంతవాక, విశాలాక్షినగర్, అప్పుఘర్, ఇసుకతోట, సీతమ్మధార, మాధవధార, గోపాలపట్నం మీదుగా గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు వెళ్లే మార్గాన్ని జీవీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో లక్షలాది మంది పాల్గొంటారని, వారికి ఎటువంటి ఇబ్బం దులు కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స శిబిరాలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు అందుబాటులో ఉండేలా చూడాన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు కేఎస్ విశ్వనాథన్, డాక్టర్ శ్రీనివాసరావు, ప్రధాన ఇంజనీర్ రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పాల్గొన్నారు.

వెలగపూడిని కలిసిన ఎస్టీయూ నాయకులు

ఎంవీపీ కాలనీ, జూలై 19 : జిల్లాలోని ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పైడిరాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యభామ యువ నృత్యోత్సవాలు

మద్దిలపాలెం, జూలై 19 : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం సత్యభామ యువ నృత్యోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు నిర్వహించే ఈ నృత్యోత్సవాల్లో 16 రాష్ట్రాల నుంచి 65 మంది కళాకారిణులు కూచిపూడి, కథకలి, భరతనాట్యాలతో మైమరిపించారు. ఈ సందర్భంగా ఆదాయ పన్నుల శాఖ మాజీ కమిషనర్ రవిశంకర నారాయణ మాట్లాడుతూ పదేళ్ల కిందట శోభనాయుడు మొదలు పెట్టిన సత్యభామ నృత్యోత్సవాలను ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.అనంతరం కూచిపూడి కళాకారిణి సజని వల్లభనేనికి శోభనాయుడుకి జాతీయ ఎక్స్‌లెన్స్ అవార్డు, గీత నారాయణ్ సుధాగణికి సత్యభామ డ్యాన్స్ ఐకాన్ అవార్డులు ప్రదానం చేశారు.





టౌన్ కొత్తరోడ్డులో నిలిచిన వర్షం నీరు



కేఆర్ఎం కాలనీలో యూజీడీ గోతుల్లో చేరిన నీరు

కుండపోత వర్షంతో అస్తవ్యస్తం

» రహదారులపై చేరిన నీరు
» రాకపోకలకు అవస్థలు

పూర్ణామార్కెట్: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో పూర్ణామార్కెట్ నుంచి టౌన్ కొత్తరోడ్డు వరకు రహదారులు జలమయ్యాయి. గురు, శుక్రవారం కురిసిన వర్షానికి ఇరువైపులా నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారుల ఇబ్బంది పడ్డారు. కాలువల్లో నీరు వెళ్లే మార్గం లేక పోవడడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షంనీటిలో ఎక్కడ గోతులు ఉన్నదీ తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం నీటితో వ్యాపారులూ అవస్థలు పడ్డారు. ఫుట్‌పాత్ వ్యాపారాలు పూర్తిగా మూతపడ్డాయి. రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఇందిరానగర్-3లో కూలిన గోడ పరిశీలిస్తున్న స్థానిక ప్రజా ప్రతినిధి

ఇందిరానగర్‌లో కూలిన ఇంటి గోడ

కంచరపాలెం, జూలై 19 : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 48వార్డు పరిధి ఇందిరా నగర్-3లో ఓ గోడ కూలి పడడంతో పక్కనున్న ఇంటి పైకప్పు విరిగిపడింది. ఈఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కూలిన గోడలు, రక్షణ ప్రహరీల పునఃనిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. దెబ్బతిన్న విద్యుత్ దీపాలకు అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించారు. బాపూజీనగర్, పల్నాటికాలనీ, రాంజీ ఎస్టేట్, శ్రీనివాసనగర్, జైభారత్ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలు వర్షం ప్రభావంతో ఇళ్లకే పరిమితమయ్యారు.

యూజీడీ తవ్వకాలతో ఇబ్బందులు

సీతమ్మధార: గ్రేటర్ 23వ వార్డు కేఆర్ఎం కాలనీలో యూజీడీ పనులు చేపడుతున్నారు. గతంలో యూజీడీ గోతులు తవ్వి పైపులైన్లు వేశారు. తిరిగి వీటిని స



నరసింహనగర్ రైతుబజారులో నిలిచిన నీరు

క్రమంగా పూడ్చకపోవడంతో ఈ గోతుల్లో వర్షం నీరుచేరింది. దీంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాల బారినపడుతున్నారు. కనీసం ప్రమాద సూచికల తెలిపే బోర్డులేదు.

అక్కయ్యపాలెం: వర్షానికి రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచిపోయింది. నరసింహనగర్ రైతుబజారులో ఫ్లోరింగ్ వర్షపు నీటితో నిండిపోవడంతో వినియోగదారులు ఇబ్బం ది పడ్డారు. వినియోగదారుల తక్కువ మంది రావడంతో బేరాలు లేవని రైతులు, వ్యాపారులు ఆ వేదన వ్యక్తం వ్యక్తం చేశారు.

గిరి ప్రదక్షిణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఈస్ట్ ఏసీపీ జయరామ్ ప్రసాద్

సీతమ్మధార, జూలై 19: సింహాచలం గిరి ప్రదక్షిణలో పాల్గొననున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యంలేకుండా చూడాలని ఈస్ట్ ఏసీపీ జయరామ్ ప్రసాద్ సిబ్బందికి సూచించారు. నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి సుందర ఫంక్షన్ హాలులో శుక్రవారం సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. గిరి ప్రదక్షిణలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు తిరుమలరావు , శ్రీనివాస్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



నేవీ స్కూల్లో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మల్కాపురం, జూలై 19: 104ఏరియా విజయనగర్‌కాలనీలోని నేవీ చిల్డ్రన్స్‌లో స్కూల్లో మూడు రోజులుగా విశాఖపట్నం బేస్ విక్టువలింగ్ యార్డ్, పినాకిల్ ఆసుపత్రి సంయుక్త భాగస్వామ్యంతో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని శుక్రవారం ఈఎన్‌సీ ఆర్‌పీడీఎం ఎం.మురళీమోహన్‌రాజు సం దర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు వైద్య చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందిని సత్కరించారు. ఈకా ర్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



జగదాంబ కూడలి, జూలై 19: వన్‌టౌన్ కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేకం సేవలను నిర్వహించారు. ఉదయం 7గంట సమయంలో ఉభయదాతలతో అర్చకులు ఈ పూజలు చేయించాయి. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వి.రాంబాబు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కొండంత సంబరం

... 5వ పేజీ తరువాయి

ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గోవింద నామస్మరణలతో గిరి ప్రదక్షిణకు ఉపక్రమిస్తారు.

గిరి ప్రదక్షిణ మార్గం

తొలిపావంచా వద్ద ప్రారంభమయ్యే భక్తులు పాత అడివివరం, పైనాపిల్ కాలనీ, హనుమంతువాక, విశాలాక్షి నగర్, అప్పుఘర్, ఎం.వి.పి.కాలనీ డబుల్‌రోడ్డు, ఇసుకతోట, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, గురుద్వారా, ఆర్ అండ్ బి, ఎస్‌పీడీ కూడలి, గోపాలపట్నం, గోశాల మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంటారు.

విస్తృత ఏర్పాట్లు

గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సంఖ్య ఏడాదిఏడాదికి పెరుగుతూ వస్తోంది. ఈ సంవత్సరం సుమారు ఎనిమిది లక్షల మంది పాల్గొనే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు ఇతర శాఖల అధికారుల సమన్వయంతో సింహాచలం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి తమ సిబ్బందితో కలిసి విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు 80 క్యూలను, 50 ఇనుప గడ్డర్లను ఏర్పాటుచేశారు. అదేవిధంగా రెండో ఘాట్‌రోడ్డు వద్ద నమూనా దేవాలయాన్ని ఏర్పాటుచేసి అక్కడ కూడా కొబ్బరికాయలు కొట్టేందుకు అనుకూల ఏర్పాట్లు చేశారు.

మార్గం పొడవునా 290 తాత్కాలిక మరుగుదొడ్లు, 29 వైద్య శిబిరాలు, 22 అంబులెన్స్‌లు, 390 ఎల్ఈడీ లైట్లు, 9 జనరేటర్లు, 6 ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లు ఏర్పాటుచేశారు. తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతలను పూర్తిస్థాయిలో జీవీఎంసీ చేపడుతోంది. అప్పుఘర్ వద్ద భక్తులు స్నానాలు చేయనున్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం వివిధ శాఖల అధికారులతో కొండదిగువన కలశం వద్ద, అడివివరం, హనుమంతువాక, అప్పుఘర్, మాధవధార, ఎన్ఎస్‌టిఎల్ గేటు వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్‌లు సిద్ధం చేశారు. ఐదు డ్రోన్ కెమెరాలతో ఉత్సవాన్ని చిత్రీకరణకు ఏర్పాట్లు చేశారు. 20వ తేదీ ఉదయం 6 నుంచి 21వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు 98వ వార్డు పరిధిలోని మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. కొండ దిగువన 29 ప్రదేశాలలో, సింహగిరిపై మూడు ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేకంగా ఫోన్ నంబర్లు

గిరి ప్రదక్షిణ నేపథ్యంలో దేవస్థానంతోపాటు పలు ప్రభుత్వ శాఖలు భక్తులకు అవసరమైన సలహాలు, సేవలు అందించేందుకు ప్రత్యేకంగా కొన్ని ఫోన్ నంబర్లు ఏర్పాటుచేశాయి. సింహాచలం దేవస్థానం (0891-2954944), జీవీఎంసీ (1800-42500009), నీటి సరఫరా, ప్రజా ఆరోగ్యశాఖలు (0891-2869111), విశాఖ పోలీస్ శాఖ (9390105353 లేదా 9330105355)

గిరి ప్రదక్షిణ భక్తులకు వర్షసూచన

విశాఖపట్నం : గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు వర్షం కొంతవరకు అంతరాయం కలిగించే అవకాశం ఉంది. శనివారం తెల్లవారుజామున పూరి సమీపంలో తీరం దాటనున్న వాయుగుండం పశ్చిమ వాయువ్యంగా పయనించి చత్తీస్‌గఢ్ మీదుగా రానున్న నేపథ్యంలో తేమగాలులు భూ ఉపరితలంపైకి వీస్తాయి. దీంతో శనివారం ఉదయం 11.30 గంటల వరకు వర్షం కొనసాగుతుందని, ఆ తరువాత మెల్లగా తగ్గుతూ దఫదఫాలుగా జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అందువల్ల భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

అంతరాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, జూలై 19: గిరి ప్రదక్షిణ, తుదివిడత చందన సమర్పణ కార్యక్రమాల నేపథ్యంలో శని, ఆదివారాల్లో సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి అంతరాలయ దర్శనాలు, అన్నిరకాల ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు నీలాద్రిగుమ్మం వద్ద నుంచే లఘు దర్శనం కల్పిస్తామన్నారు. శనివారం ఉదయం 6.30 నుంచి 2.30 గంటల వరకు, 3 నుంచి రాత్రి 7 గంటల వరకు, 8.30 నుంచి తిరిగి 10 గంటల వరకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. ఆషాఢ పౌర్ణమి రోజున (ఆదివారం) వేకువజామున 2.00 గంటలకు సుప్రభాత (ఏకాంత) సేవ, అనంతరం 3.00 గంటల వరకు స్వామి వారికి తుదివిడత చందన సమర్పణ జరుగుతుందన్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయ ప్రాకారం చుట్టూ ప్రదక్షిణకు అనుమతిస్తామని చెప్పారు. ఉదయం 5.00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకూ నిర్విరామంగా భక్తులకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి. సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ఆలయ బేడా మండపంలో డిల్లీ విజయం ఉత్సవం నిర్వహించనున్నందున భక్తులకు దర్శనాలు లభించవు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు, తిరిగి రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు భక్తులకు దర్శనాలు లభిస్తాయి. భక్తుల రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో ఎటువంటి సిఫారసు లేఖలు అనుమతించబడవని ఈవో పేర్కొన్నారు. భక్తుల రద్దీతో సింహగిరి పైకి ఎటువంటి వాహనాలను అనుమతించరని, దిగువన ఏర్పాటుచేసిన పార్కింగ్ స్థలాల్లో తమ వాహనాలను నిలిపి దేవస్థానం ఏర్పాటుచేసిన వాహనాలలో మాత్రమే రాకపోకలు సాగించాలని ఈఓ కోరారు.

గ్రేటర్‌పై టీడీపీ దృష్టి

... 5వ పేజీ తరువాయి

వచ్చేందుకు సిద్ధమైన 22 మంది కార్పొరేటర్లనూ తీసుకోవాలని నిర్ణయించారు. వైసీపీ నుంచి ఎవరెవరిని తీసుకోవాలనే విషయమై ఎమ్మెల్యేలు గురువారం రాత్రి సమావేశంలో చర్చించారు. అయితే ఆ జాబితాలో ఉన్న ఒకరిద్దరిని పక్కనపెట్టాలని కొందరు ప్రతిపాదించారని తెలిసింది. పార్టీలోకి ఇష్టపూర్వకంగా వచ్చేవారిని మాత్రమే తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 21వ తేదీ ఆదివారం వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరున్నట్టు సమాచారం. తరువాత జీవీఎంసీ సాధారణ సమావేశం నిర్వహణ తేదీ ప్రకటించే అవకాశం ఉంది. దీనిలో భాగంగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నారు.

ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు కార్యాచరణ

... 5వ పేజీ తరువాయి

ప్రచురించడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. జాయింట్ కలెక్టర్ ఆ ప్రాంతాన్ని సందర్శించి సొసైటీ పనులను నిలిపివేయాలని ఆదేశించారు. అసలు ఆ లేఅవుట్‌కు సీఆర్‌జడ్ అనుమతి ఇవ్వాలంటే కలెక్టర్ అధ్యక్షతన కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ కమిటీలో చర్చించి కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖకు సిఫారసు చేయాలి. కానీ అటువంటి అనుమతులు లేవని నిర్ధారించారు. ఇదిలావుండగా భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తించిన 250 ఎకరాలకు సరిహద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ లేదా సరిహద్దులు తెలిపేలా స్తంభాలు ఏర్పాటుచేస్తే వివాదాలకు తెరపడుతుందని అధికారులు యోచిస్తున్నారు. దీనికి అనుగుణంగా త్వరలో సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని భావిస్తున్నారు. అనంతరం పలువురి ఆక్రమణలో ఉన్న భూములు స్వాధీనం చేసుకునే దిశగా చర్యలు తీసుకోనున్నారు. ఐఎన్ఎస్ కళింగకు ఇచ్చిన భూమి వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదని దానిని తప్పించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భీమిలి సొసైటీకి ఇచ్చిన భూమి వెనక్కి తీసుకుని ప్రత్యామ్నాయంగా మరోచోట ఇస్తే ఎలా ఉంటుందని అధికారులు ఆలోచిస్తున్నారు. భూమి వివాదంలో సొసైటీ సుప్రీంకోర్టుకు వెళ్లి అనుమతులు పొందిన విషయాన్ని జిల్లా యంత్రాంగం పరిగణనలోకి తీసుకుని అటు సొసైటీకి ఇబ్బంది లేకుండా ఇటు భౌగోళిక వారసత్వ సంపదకు ప్రమాదం వాటిల్లికుండా ఎలా ముందుకువెళ్లానే అంశంపై త్వరలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ముసురు

... 5వ పేజీ తరువాయి

భారీ వృక్షం నేలకూలింది. రానున్న రెండు రోజులు కూడా చిరుజల్లులు నుంచి ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అల్పపీడనం నేపథ్యంలో సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లాలో గత రెండు రోజులుగా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వాసులు ఎటువంటి సమస్య తలెత్తినా కంట్రోల్ రూమ్ (0891-2590102, 0891-2590100)కు తెలియజేయవచ్చునన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయిడు సమీక్ష

భారీవర్షాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి నష్టం జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విశాఖ నుంచి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పాల్గొన్నారు.

'పోర్టు ట్రస్ట్ వాహనాల కట్టడికి చర్యలు తీసుకోవాలి'

పూర్ణామార్కెట్, జూలై 19: జనావాసాల మధ్యనుంచి వెళ్తున్న విశాఖ పోర్టు ట్రస్ట్‌కు చెందిన టిప్పరు, ఇతర భారీ వాహనాలతో తలెత్తుతున్న ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విల్లూరి మాట్లాడుతూ, పోర్టుట్రస్ట్ ట్రాన్స్‌పోర్టు విభాగం అనాలోచిత విధానాలతో వెలంపేట, పాతబస్టాండ్, స్టేడియంరోడ్డు పరిసర ప్రాంతాలకు చెందిన నివాసితులకు రాత్రి వేళల్లో కంటిమీద కునుకులేకుండా పోతుందని స్పష్టం చేశారు. పోర్టు టిప్పర్లు శబ్దంతో పగలురాత్రి రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. గత నెలరోజులుగా ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు వివరించారు. భారీ వాహనాలతో రోడ్లు దారుణంగా మారాయన్నారు. టిప్పర్లతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరి అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయన్నారు. పోర్టు ట్రస్ట్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి ఈ భారీ వాహనాలను నిరోధించేలా చర్యలు తీసుకోవాలని సీతంరాజు సుధాకర్‌ను కోరారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నిరాశ్రయుల షెల్టర్లను అభివృద్ధి చేయాలని వినతి



మంత్రి దుర్గేశ్‌కు వినతి పత్రం అందిస్తున్న వాసు

అక్కయ్యపాలెం, జూలై 19: వలస కార్మికులకు కేరళ తరహా వర్కింగ్ హాస్టల్స్, నిరాశ్రయులకు పర్మినెంట్ షెల్టర్లు అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌ను ఏఐయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఈ విషయాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. అలాగే, గత ప్రభుత్వం మున్సిపాలిటీల జనరల్ ఫండ్స్ రూ. 1,952 కోట్లు దారి మళ్లించిందన్నారు. దీంతో రాష్ట్రంలోని 89 నిరాశ్రయ వసతి గృహాలకు నిధులు మంజూరు కాలేదని, అలాగే, వాటిని రెన్యువల్ చేయలేదని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జాతీయ పట్టణ ఉపాధి మిషన్ (ఎన్‌యూఎల్ఎం) నిధులను కేంద్ర ప్రభుత్వంనుంచి తీసుకురావాలని కోరారు. గతంలో సుప్రీం కోర్టు తీర్పు మేరకు విశ్రాంత ఐఏఎస్ అధి కారితో జేసీ శర్మ కమిటీ నియమించిందని, 2020లో శర్మ రాజీనామాతో కార్యకలాపాలు ముందుకుసాగడంలేదన్నారు. వెంటనే ఈ కమిటీని నియమించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు పెరుగుతున్న వలసల నివారణ, ఇతర సమస్యలపై డిప్యూటీ సీఎంతో సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

» ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఆప్సా ప్రతినిధుల వినతి



వంశీకృష్ణకు వినతి ప త్రమిస్తున్న ఆప్సా ప్రతినిధులు

మహారాణిపేట, జూలై 19: ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య అసోసియేషన్ నాయకులు దక్షిణ ని యోజకవర్గ శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీని వాస్‌ను కోరారు. శుక్ర వారం ఎమ్మెల్యేను విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలసి వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చీకటి రమేష్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. శ్రీనివాస్ , డి.ఎ. శ్రీనివాస్,ఎం శ్రీనివాస్, పి. గోవింద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో మంత్రి శ్రీనివాస్



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గాజువాక, జూలై 19: మెడ్‌టెక్ జోన్‌ను శుక్రవారం ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు. వైద్య పరికరాల తయారీ, వసతులు, కంపెనీ ఆపరేషన్ ప్రక్రియలను తెలుసుకున్నారు. అనంతరం పలువురు సీఈవోలతో భేటీ అయ్యారు. ఉద్యోగులు, కంపెనీల వివరాలు, అందుతున్న సౌకర్యాలపై చర్చించారు. మార్కెటింగ్ ట్రెండ్ ఇతర అంశాలపై మాట్లాడారు. ఆయన వెంట విశాఖ, అనకాపల్లి జిల్లాల పరిశ్రమల శాఖ అధికారులు గణపతి, శ్రీధర్ ఉన్నారు.

సాయి ధ్యాన మందిరంలో గురు పౌర్ణమికి ఏర్పాట్లు



షిర్డీసాయి నల్లరాతి విగ్రహం



విద్యుద్దీపాలతో రైల్వే కాలనీలోని ఆలయం

అక్కయ్యపాలెం, జూలై 19: గురుపౌర్ణమి వేడుకలకు (ఈనెల 21తేదీన) గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి బాబా ధ్యానమందిరం సిద్ధమవుతోంది. 1994లో విజయ దశమి రోజున స్వామి విగ్రహ ప్రతిష్ఠతో చిన్న ఆలయంగా ప్రారంభమై అనంతరం దాతల సహకారంతో అభివృద్ధి చెందింది. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, టి.రాంబాబు నేతృత్వంలో 30 ఏళ్లుగా మందిరంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ మందిరంలో నల్లరాతి విగ్రహం ప్రత్యేకం.

14 ఏళ్లుగా నిత్యాన్నదానం

మందిరంలో 2010 నుంచి నిత్యాన్నదానం దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. రోజూ 100 నుంచి 150 మంది భక్తులు, యాచకులకు, నిరుపేదలకు అన్నప్రసాదం పెడుతున్నారు. గత 16 ఏళ్ల నుంచి ప్రతి గురువారం ఉచిత వైద్య పరీక్షలతోపాటు రక్తదాన శిబిరాలు కొనసాగిస్తున్నారు. వృద్ధులకు పెన్షన్లు అందిస్తున్నారు. గత మూడేళ్లుగా కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లను ఏర్పాటు చేసి రాత్రి వేళల్లోనూ ఆకలితో ఉన్న వారికి ఆహారం అందిస్తున్నారు.

భక్తులకు తీర్థయాత్రలు

1994 నుంచి ఏటా డిసెంబరులో ధ్యానమందిరం ఆధ్వర్యంలో భక్తులకు షిర్డీ, కాశీ, రామేశ్వరం యాత్రలకు తీసుకెళ్తున్నారు. ఉచితంగా వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం భక్తుల స్వహస్తాలతో బాబాకు క్షీరాభిషేకం, సాయంత్రం పల్లకీ మహోత్సవం ఉంటుంది.

రైల్వే శాఖకు కేటాయించిన స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే. జీవీఎంసీ అధికారులు

ఆరిలోవ, జూలై 19 : ముడసర్లోవలో రైల్వే శాఖకు జీవీఎంసీ కేటాయించిన స్థలాన్ని రైల్వే శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. సర్వే నెంబరు 26లో సుమారు రెండు ఎకరాలను రైల్వే శాఖకు కేటాయించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జోన్ టు టౌన్ ప్లానింగ్ ఏసీపీ రైల్వే అధికారులకు ఆ స్థలాన్ని చూపించారు. భూమి బదలాయింపులో భాగంగా ముడసర్లోవ భూములను జీవీఎంసీ రైల్వే శాఖకు కేటాయించింది.

క్రీడలకు ఐవోఎల్ సహకారం

మహారాణిపేట, జూలై 19: సామాజిక పరివర్తనలో భాగంగా దేశ వ్యాప్తంగా క్రీడల ప్రోత్సాహానికి ఐవోఎల్ సహకారాన్ని అందిస్తుందని సంస్థ ప్రతినిధి ఎన్. సెల్వకుమార్ తెలిపారు. శుక్రవారం దసపల్లా హిల్స్ లో జరిగిన సమావేశంలో ఆయన మా ట్లాడారు. ఉమీద్ ఏ హోప్ ప్రాజెక్టు ద్వారా ఎందరో జీవితాలలో వెలుగు నింపుతుందని లిపారు. ఖైదీలు, బాల నేరస్తుల్లో పరివర్తనకు స్పోర్ట్స్ కోచింగ్ పరికరాలను అందించనున్నట్లు చెప్పారు. వారు కొత్త జీవితంలోకి అడుగు పెట్టేందుకు ఆన్‌లైన్ ద్వారా చెస్ పోటీలను నిర్వహించినట్టు చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ సహాయ సహకారాలను అందిస్తున్నట్టు వివరించారు.

రైతుబజారుల్లో సబ్సిడీపై టమాటా విక్రయాలు



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఏడీ యాసీన్

అక్కయ్యపాలెం, జూలై 18 : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో సబ్సిడీపై టమాటా కిలో రూ.58కి విక్రయాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ వాణి జ్య మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఎస్‌కే యాసీన్ టమాటా విక్రయిస్తున్న స్టాళ్లను సందర్శించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టమాటా విక్రయించాలని డ్వాక్రా గ్రూపుల వ్యాపారులకు సూచించారు. ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

కొనుగోలుదారులు హర్షం

కంచరపాలెం : కంచరపాలెం రైతుబజారులో ప్రభుత్వం శుక్రవారం నుంచి పంపిణీ చేస్తున్న సబ్సిడీ టమాటా కొనుగోలుకు వినియోగదారులు ఆసక్తి చూపారు. బజారుకు టమాటా 26 క్వింటాళ్లు రాగా, వాటిలో 18 క్వింటాళ్లు విక్రయించారు. కిలో టమాటా బయట మార్కెట్‌లో రూ.70 నుంచి రూ.75 ధర ఉంది. రైతుబజారుల్లో కిలో రూ.58కే అందిస్తున్నారు. దీంతో పేద,మధ్య తరగతి కొనుగోలు దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై కందిపప్పు, టమాటా, బియ్యం అందిస్తుండడంతో అభినందనీయమని పలువురు కొనియాడారు.



శాకాంబరిగా దుర్గాలమ్మ

కొమ్మాది, జూలై 19 : చంద్రంపాలెం జాతర గట్టుపై వెలసిన దుర్గాలమ్మ ఆలయంలో ఆషాడ మాసం శుక్రవారం కావడంతో శాకాంబరిగా అలంకరించారు. అమ్మవారిని పలు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. అలాగే భక్తులు తీసుకువచ్చిన సారెను అమ్మవారికి నివేదించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పిళ్లా చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు పాల్గొన్నారు.

'నామినేటెడ్ పోస్టుల్లో వెలమలకు ప్రాధాన్యమివ్వాలి'

ఎంవీపీ కాలనీ, జూలై 19 : త్వరలో నామినేటెడ్ పదవులు కేటాయించనున్న నేపథ్యంలో వెలమలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. శుక్రవారం ఆయన ఎంవీపీ కాలనీలోని ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. వెలమ సామాజిక వర్గాన్ని బీసీ డి నుంచి ఎలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఏయూ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన శశిభూషణరావుకు అభినందనలు తెలిపారు.

వారిజలో గురుపౌర్ణమి పూజలు రేపు

భీమునిపట్నం, జూలై 19 : బీచ్‌రోడ్ మంగమారిపేట వారిజ ఆశ్రమంలోని శ్రీలక్ష్మీ హయగ్రీవ మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా పెరుమాళ్ళకు తిరుమంజనం వేదోక్తంగా నిర్వహించనున్నట్టు కార్యక్రమ నిర్వాహకుడు శ్రీకాంత్ శర్మ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం ఆరున్నర గంట నుంచి పెరుమాళ్ళకు అభిషేకాలు, పదిన్నరకు ఆచార్య పాదుకారాధన జరుగుతుందన్నారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, జూలై 19 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంతరం ఆగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

కిడ్నీ రోగికి రోబొటిక్ చికిత్స

ఆరిలోవ, జూలై 19 : హెల్త్ సిటీలో ఉన్న మెడి కవర్ వైద్యులు రోబొటిక్ చికిత్స ద్వారా కిడ్నీ రోగికి కేన్సర్ కణితిని తొలగించారు. డాక్టర్ భాస్కర్ తెలిపిన వివరాలు మేరకు.. ఒడిశాకు చెందిన 70 ఏళ్ల కిడ్నీ రోగి కేన్సర్ కణితితో ఆస్పత్రిలో చేరాడు. అతనికి సుమారు పది సెంటీమీటర్ల పరిమాణంలో కేన్సర్ కణితి ఉండడంతో రోబొటిక్ చికిత్స ద్వారా తొలగించామని చెప్పారు.

సినిమా గైడ్

- **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)
- **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),
- **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),
- **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36,టమాటా 58, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 18, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 40, బీరకాయలు 28, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 34, క్యారేట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 140, బరబటి 30, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 38, కీరదోస 26, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 62, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



పొంగిపొర్లుతున్న పాతపరదేశిపాలెం గంభీరం గెడ్డ



మధురవాడ మార్కెట్‌లో నిలిచిన వర్షం నీరు



ఆదర్శనగర్ కొండవాలు ప్రాంతంలో విరిగిన విద్యుత్ స్తంభం

జన జీవనం అస్తవ్యస్తం

- ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం
- ఇబ్బందులకు గురైన ప్రజలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- జలకళతో సాగునీటి వనరులు

భీమునిపట్నం, జూలై 19 : తూర్పు, భీమిలి నియోజక వర్గాల్లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడుతోంది. దీంతో జన జీవనం స్తంభించింది. ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, విధులకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు. ఏకధాటిగా జల్లులుగా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా సాగునీటి చెరువులు, కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. గెడ్డలు నుంచి ప్రవహించిన నీరు గోస్తనీ నది ద్వారా ప్రవహించిన వర్షపు నీరు భీమిలి పట్టణంలోని ఉప్పుటేరులోకి అధికంగా వచ్చి చేరింది. దీంతో ఉప్పుటేరు నీటి మట్టం పెరగడంతో ఆనుకుని వున్న తోటవీధి ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. ఈవిషయాన్ని మత్స్యకార నాయకులు గంటా నూకరాజు, వాసుపల్లి కొండబాబు, తదితరులు జోనల్ కమిషనరు కనకమహాలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె తీర ప్రాంతంలో పర్యటించారు. అత్యవసరంగా ఉప్పుటేరుకు, సముద్రానికి మధ్య మేట వేసిన ఇసుక దిబ్బల మధ్య ట్రెంచ్ తవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు వెంటనే జేసీబీని రప్పించి ట్రెంచ్ తవ్వారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో తోటవీధి, ఎగువపేట, బోయవీధి మత్స్యకారులతో పాటు అన్నవరం, పెదనాగమయ్యపాలెం, చినగానమయ్యపాలెంలో మత్స్యకారులు బోట్లు, వేట సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బీచ్ రోడ్‌లో హౌస్ ఆఫ్ హేంగోవర్ వద్ద రహదారిపై నీరు నిలిచిపోవ డంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

పొంగిపొర్లుతున్న పాతపరదేశిపాలెం గెడ్డ

పాతపరదేశిపాలెం వద్ద గంభీరం గెడ్డ పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. 4వ వార్డులో చేరిన ఈ గ్రామ ప్రజలు బోయపాలెం-మధురవాడ జాతీయ రహదారి నుంచి ఈ గెడ్డ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే మార్గంలో కాపులుప్పాడ, రెడ్డీలపాలెం,సోమన్నపాలెం,ఎస్సీ కాలనీ ప్రజలు కూడా రాకపోకలు సాగిస్తుంటారు.రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడంతో గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు బోయిపాలెం జంక్షన్ మీదుగా గ్రామానికి చేరుకుంటున్నారు. కాగా రెండు రోజుల్లో మండలంలో 26.6 ఎంఎం వర్షపాతం నమోదైందని హెచ్‌డిటి సూరిశెట్టి శ్రీనుబాబు తెలిపారు.

భయాందోళనలో కొండవాలు నివాసితులు

కొమ్మాది/మధురవాడ : మధురవాడ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. మధురవాడ కూడలి, ఎత్తు వంతెన, మధురవాడ పీహెచ్‌సీ, డైలీ మార్కెట్‌లో నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. స్వతంత్రనగర్ కాలనీ, బాపూజీనగర్, పోర్టు కాలనీల్లో కొన్ని ఇళ్లు ముంపునకు గురయ్యాయి. కాలువల్లో పూడిక వల్ల వర్షపు నీరు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకపోవడంతో చంద్రంపాలెం, కారుషెడ్ ప్రాంతాల్లో సర్వీసు రోడ్లపై మోకాలు లోతులో నీరు చేరింది. దీంతో బైక్‌లు నీటిలో చిక్కుకున్నాయి. మధురవాడ ఎత్తు వంతెన వద్ద భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అలాగే కొండవాలు ప్రాంతాలైన శారదానగర్,సాయిరాంకాలనీ, కార్పెంటర్స్ కాలనీ, సద్గురుసాయినాథ్ కాలనీ, వికలాంగుల కాలనీ, స్వయంకృషినగర్, గాంధీనగర్, శివశక్తినగర్, ముత్యాలమ్మ కాలనీల్లో మట్టి పెళ్లలు జారి ఇళ్ల కింద కోతలు ఏర్పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని నివాసితులు భయపడుతున్నారు. స్వయం కృషినగర్‌లో మట్టి పెళ్లలు జారి పడి ప్రమాదకరంగా ఉన్న రేకుల షెడ్లను జోన్-2 కమిషనర్ శైలాజా వల్లి పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో ఉంటున్న వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించారు.

భీమునిపట్నం (రూరల్) : మండలంలో రెండు రోజులుగా పడుతున్న వర్షాలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో చేరడంతో వ్యవసాయ పనులకు ఢోకా ఉండదని సంబర పడుతున్నారు. భారీ వర్షాలకు తాటితూరు నగరపాలెం, కురపల్లి ప్రాంతాల్లో నది నీరు చెరువుల్లోకి చేరి చప్టాలపై నుంచి ప్రవహిస్తోంది. గోస్తనీ నదిలో భారీగా వరద నీరు చేరడంతో నిండుగా ప్రవహిస్తోంది.

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెం కూడలి నుంచి కైలాసగిరికి వెళ్లే ప్రధాన మార్గంలో గత పోలీసు క్వార్టర్స్ ప్రాంతంలో చెట్టు కూలి గోడ ధ్వంసమైంది. అలానే అదే మార్గంలో కొన్ని చెట్ల కొమ్మలు నేలకొరిగాయి. గిరి ప్రదక్షిణ మార్గం కావడంతో జీవీఎంసీ సిబ్బంది వెంటనే చెట్ల కొమ్మలను తొలగించి, రోడ్డును శుభ్రం చేశారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భీమిలి రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతానికి ఏవిధమైన నష్టం లేదని తహసీలార్ గోవింద్ తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో ఆర్డీవో కార్యాలయం సీనియరు అసిస్టెంట్ ప్రసన్న కుమార్, తహసీల్దార్ ఆఫీసులో వీఆర్వో రఘు, సిబ్బంది అశోక్, తేజ పనిచేస్తున్నారు. ఎక్కడ ఏవిధమైన ప్రమాద సంఘటన జరిగినా 08933293450 నంబరును సంప్రతించాలని అధికారులు సూచించారు.

సింహాచలం : సింహగిరిపై శుక్రవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. దీంతో అప్పన్న దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు.

వర్షాలతో అప్రమత్తం : తహసీల్దారు

పద్మనాభం : వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఎన్. వెంకటరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉందని, అటువంటి ప్రదేశాలను గ్రామస్థాయి అధికారుల ద్వారా ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇళ్లు, పంటలకు నష్టం లేకుండా చూడాలని చెప్పారు.

ఆరిలోవ : ఆదర్శ నగర్‌లో కొండవాలు ప్రాంతంలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఆ సమయంలో వర్షం పడుతుండడంతో ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఒక స్తంభం ఓ ఇంటిపై పడడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. కాగా పెదగదలి జంక్షన్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వెనుక భాగంలో ఆవు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు కిందకు వేలాడి ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు.



భీమిలిలో మత్స్యకారులతో పరిస్థితిని సమీక్షిస్తున్న జడ్సీ కనకమహాలక్ష్మి



స్వయంకృషి నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న జోన్ 2 జడ్సీ శైలజా వల్లి



విశాలాక్షినగర్ : పోలీసు క్వార్టర్స్‌లో వర్షాలకు నేలకొరిగిన చెట్టు

గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తి

ఎంవీపీ కాలనీ/ఆరిలోవ, జూలై 19 : గిరి ప్రదక్షిణకు అధికార యంత్రాంగం శరవేగంగా ఏర్పాట్లు పూర్తి చేసింది. గిరి ప్రదక్షిణకు లక్షలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వస్తారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని దారి పొడవునా అధికారులు ఏర్పాట్లు చేశారు.అప్పుఘర్ వద్ద చాలామంది సముద్ర స్నానమాచరించిన అనంతరం తిరిగి ప్రయాణమవుతారు. ఈమేరకు అక్కడ మరుగుదొడ్లు, మంచినీటి వసతి, వైద్య సేవలు, టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. అలాగే ధారపాలెంనుంచి హనుమంతువాక జంక్షన్ వరకు స్వచ్ఛంద సంస్థల సేవల కోసం టెంట్లు వేశారు. 20 చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు, మూడు ప్రధానమైన ప్రాంతాల్లో తాగునీటి పాయింట్లు ఏర్పాట్లు చేశారు. హనుమంతువాక జంక్షన్ నుంచి వెంకోజీపాలెం వైపు వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లకుండా అర కిలోమీటరు మేర గ్రిల్స్ అమర్చారు. రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడానికి జీవీఎంసీ 200 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచినట్టు జోన్ 2 జడ్సీ శైలజ వల్లి తెలిపారు. ఆరిలోవ సీఐ గోవిందరావు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సిబ్బందిని అం దుబాటులో ఉంచుతున్నారు.

విశాలాక్షినగర్ : విశాలాక్షినగర్ నుంచి అప్పుఘర్ వరకు రహదారులన్నీ శుభ్రం చేస్తున్నారు. అలానే విద్యుత్ దీపాలను మరమ్మతు చేస్తున్నారు. హనుమంతవాక కూడలి నుంచి విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం కూడలి, తెన్నేటీ పార్కు, అప్పుఘర్ ప్రాంతాల్లో ప్రతి ఐదు వందల మీటర్లకు మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా టెంట్లు వేశారు.



విశాలాక్షినగర్‌లో ఏర్పాటు చేసిన టెంట్

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి : మేయర్



ఏర్పాట్లు గురించి అధికారులతో చర్చిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

వెంకోజీపాలెం/విశాలాక్షినగర్, జూలై 19 : గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె సింహాచలం తొలి పావంచ నుంచి అడవివరం, హనుమంతవాక, విశాలాక్షినగర్, అప్పుఘర్, ఇసుకతోట, సీతమ్మధార, మాధవధార, గోపాలపట్నం మీదుగా గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు వెళ్లే మార్గాన్ని జీవీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో లక్షలాది మంది పాల్గొంటారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స శిబిరాలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు అందుబాటులో ఉండేలా చూడాన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు కేఎస్ విశ్వనాథన్, డాక్టర్ శ్రీనివాసరావు, ప్రధాన ఇంజనీర్ రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వెలగపూడిని కలిసిన ఎస్టీయూ నాయకులు



ఎమ్మెల్యే వెలగపూడిని కలిసిన ఎస్టీయూ నాయకులు

ఎంవీపీ కాలనీ, జూలై 19 : జిల్లాలోని ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పైడిరాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు బాలికలు ఎంపిక

భీమునిపట్నం, జూలై 19 : పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 44 మంది విద్యార్థినులు న్యూఢిల్లీకి చెందిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అందించే ప్రగతి మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన వారిలో 28 మంది సీఎంఈ, 15 మంది ఈసీఈ, సీఈ విభాగాలకు చెందిన వారు ఉన్నారన్నారు. మరో 96 మంది విద్యార్థినులకు ప్రగతి స్కాలర్ షిప్ రెన్యువల్ అయ్యిందని చెప్పారు. ఎంపికైన వారికి ఏడాదికి ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున మూడేళ్ల పాటు స్కాలర్ అందుతుందన్నారు.

గంటాను కలిసిన వైసీపీ కార్పొరేటర్ ?

సాగర్‌నగర్, జూలై 19 : జీవీఎంసీ 8వ వార్డు వైసీపీ కార్పొరేటర్ లొడగల అప్పారావు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావును కలిసిన ఫొటో సోషల్ మీడియాలో శుక్రవారం వైరల్ అయ్యింది. అప్పారావు టీడీపీలో చేరడానికే ఆయన తన కుమారులతో కలిసి గంటాను కలిశారని ప్రచారం జరిగింది. అప్పారావు తొలుత టీడీపీలో సీనియర్ నేత కావడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. కాగా తాను పార్టీ మారడం లేదని, గంటాను మర్యాదపూర్వకంగా కలిశానని కార్పొరేటర్ అప్పారావు ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు.

కాలువలు ఏర్పాటు చేస్తాం

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- సంగివలస చెరువు పరిశీలన

తగరపువలస, జూలై 19 : జాతీయ రహదారి పక్కనున్న సర్వీసు రోడ్ల నుంచి వచ్చిన వర్షపు నీరు సంగివలస చెరువులోకి వెళ్లేలా కాలువలు నిర్మిస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ అధికారులతో కలిసి చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగివలస, సబ్బివానిపేట ప్రాంతాల్లో మురుగు కాలువలు లేకపోవడంతో వర్షం నీరు సర్వీసు రోడ్డు నుంచి చెరువులో కలుస్తోందన్నారు. బ్రిడ్జిని ఆనుకుని ఉన్న చెరువులో నీటి ప్రవాహ ప్రాంతాన్ని కిందకి చేస్తే నీరు చెరువులోకి నిల్వ లేకుండా వెళతుందన్నారు. చెరువు నిండిపోతే మిగులు నీరు వదిలిపెట్టే విషయంలో కూడా రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. చెరువు ప్రాంతాన్ని దివీస్ సంస్థ అభివృద్ధి చేసి పార్కుగా తయారు చేసిందని, నీరు నిల్వ ఉండకుండా కాలువల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలొ మధురవాడలో కూడా ఇటువంటి సమస్య ఉంటే అధికారులతో మాట్లాడి పరిష్కరించానని తెలిపారు.కాగా ఈ ప్రాంతంలో సిసి కెమెరాలు, పోలీసు బీట్ ఏర్పాటు చేయాలని బీజేపీ, జనసేన నాయకులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం గంటా విలేకర్లతో మాట్లాడుతూ వర్షాల వల్ల ఎదురయ్యే విపత్కర పరిస్థితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టరుతో మాట్లాడానన్నారు. మండలంలో అత్యధిక మత్స్యకార గ్రామాలున్నాయని, పునరావాస చర్యలు తీసుకోవాలని చెప్పానన్నారు. గతంలో వైసీపీ చేసిన తప్పిదాల వల్ల చాలా నష్టాలు జరుగుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, బీజేపీ కన్వీనరు కె. రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.



చెరువులో నీటి ప్రవాహాన్ని చూస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

వ్యక్తిగత శుభ్రత పాటించండి : డీఎంహెచ్‌ఓ

కొమ్మాది, జూలై 19 : వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థినులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూడాలని డీఎంహెచ్‌ఓ పి. జగదీశ్వరావు మారికవలస గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం సిబ్బందిని ఆదేశించారు. వసతి గృహానికి చెందిన ఇద్దరు బాలికలకు మలేరియా రావడంతో ఆయన శుక్రవారం హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం మారికవలస పీహెచ్‌సీని సందర్శించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.

పారా స్పోర్ట్స్‌లో అంధ బాలికల ప్రతిభ

సాగర్‌నగర్, జూలై 19 : బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో ఇటీవల జరిగిన నేషనల్ అథ్లెటిక్స్ పారా స్పోర్ట్స్‌లో అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు.పోటీల్లో వారు స్వర్ణం, కాంస్య పతకాలు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ జి. తిరుమల ప్రసాద్ తెలి పారు. సబ్ జూనియర్స్ విభాగంలో 9వ తరగతి చదువుతున్న కరుణకుమారి జావెలిన్ త్రోలో బంగారు పతకం కైవసం చేసుకోగా కె. సారిక లాంగ్ జంప్‌లో కాంస్య పతకం గెలుపొందిందన్నారు.

వైభవంగా సత్యభామ యువ నృత్యోత్సవాలు

మద్దిలపాలెం, జూలై 19 : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం సత్యభామ యువ నృత్యోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు నిర్వహించే ఈ నృత్యోత్సవాల్లో 16 రాష్ట్రాల నుంచి 65 మంది కళాకారిణులు కూచిపూడి, కథకలి, భరతనాట్యాలతో మైమరిపించారు. ఈ సందర్భంగా ఆదాయ పన్నుల శాఖ మాజీ కమిషనర్ రవిశంకర నారాయణ మాట్లాడుతూ పదేళ్ల కిందట శోభనాయుడు మొదలు పెట్టిన సత్యభామ నృత్యోత్సవాలను ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.అనంతరం కూచిపూడి కళాకారిణి సజని వల్లభనేనికి శోభనాయుడుకి జాతీయ ఎక్సలెన్స్ అవార్డు, గీత నారాయణ్ సుధాగణికి సత్యభామ డ్యాన్స్ ఐకాన్ అవార్డులు ప్రదానం చేశారు.

మేయర్ దృష్టికి బీఆర్‌టీఎస్ సమస్యలు

సింహాచలం, జూలై 19 : బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వార్డు కార్పొరేటర్ నరసింహం, తదితరులు మేయర్ హరి వెంకటకుమారి దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం కలెక్టర్‌తో కలిసి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన మేయర్‌ను కొండ దిగువన కార్పొరేటర్‌తో పాటు టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ కలిసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణం వల్ల అడివివరం గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర కార్యదర్శి లండ శ్రీనివాస్, వార్డు టీడీపీ మాజీ అధ్యక్షుడు మేక కాసుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఇన్‌చార్జి వీసీకి అభినందనలు

వెంకోజీపాలెం, జూలై 19 : ఏయూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జి. శశిభూషణరావుకి ఏయూ పరిరక్షణ సమితి అభినందనలు తెలియజేసింది. ఈ సందర్భంగా సమితి సభ్యులు పలు సమస్యలను వీసీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. సురేష్‌మీనన్, రాజేష్, ఆశ, ప్రసాద్, మురళి, రామచంద్రుడు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో పోలీసు వాహనాలు ఢీ

ఆరిలోవ, జూలై 19 : పెదగదిలి సమీపంలోని అపోలో ఆస్పత్రి ఎదురుగా ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం రెండు పోలీసు వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని ఆరిలోవ పోలీసులు తెలిపారు. గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలించడానికి సింహాచలం వైపు నుంచి వస్తున్న వాహనాన్ని హనుమంతవాక జంక్షన్ నుంచి వస్తున్న వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.